డ్వామాలో సామగ్రి మాయం

లక్ష్మీనగర్(అనంతపురం) : డ్వామా (జిల్లా నీటి యాజమాన్య సంస్థ) సమావేశ భవనం, పీడీ బంగ్లాలో ఉండాల్సిన రూ.లక్షలు విలువ చేసే సామగ్రిని కొందరు ఉద్యోగులు గుట్టుచప్పుడు కాకుండా తరలించినట్లు సామాజిక మాధ్యమం ద్వారా బయటపడింది. సమావేశ భవనంలో ఏసీలు, బంగ్లాలోని డైనింగ్ టేబుల్, టీవీ, కంప్యూటర్, ఫ్యాక్స్ యంత్రం వంటి తదితర వాటిని తరలించినట్లు చర్చ సాగుతోంది. ఈవిషయంపై డ్వామా పీడీ సలీంను సంప్రదించగా కొత్తగా విధుల్లో చేరానని, విచారించి శాఖ పరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బాధ్యత తీసుకోండి... బాగు చేయండి

- వైకాపా పాలనలో అటకెక్కిన హెచ్చెల్సీ ఆధునికీకరణ
- తెదేపా కూటమి ప్రజాప్రతినిధులపైనే అన్నదాతల ఆశలు




కణేకల్లు వద్ద అసంపూర్తిగా హెచ్చెల్సీ అవుట్‌ఫాల్ రెగ్యులేటర్ ప్రత్యామ్నాయ వంతెన

ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే, బొమ్మనహాళ్: కరవు జిల్లాలో 1.45 లక్షల ఎకరాలకు సాగునీరు, 10 లక్షల మందికి తాగునీరు అందించే తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) ఆధునికీకరణ పనులను గత వైకాపా ప్రభుత్వం అటకెక్కించింది. ఐదేళ్లలో కనీసం తాత్కాలిక మరమ్మతులూ చేయించలేదు. డిస్ట్రిబ్యూటరీలు, పంట కాలువల్లో కంపచెట్లు పెరిగి నీరు చివరి ఆయకట్టుకు అందని పరిస్థితి నెలకొంది. ప్రధాన కాలువ ఎక్కడికక్కడ గండ్లుపడి బలహీనంగా మారింది. ఫలితంగా తుంగభద్ర నీరు 2,600 క్యూసెక్కులకు గాను 1,800 క్యూసెక్కులే తీసుకుంటున్నారు. తెదేపా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆధునికీకరణ పనులపై రైతుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టి వేగంగా ఆధునికీకరణ పనులు చేపట్టాల్సిన బాధ్యత కూటమి ప్రజాప్రతినిధులపై ఉంది. ఇప్పుడు ప్రయత్నాలు మొదలుపెట్టి వచ్చే వేసవిలో పనులు జరిపించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఫలిస్తున్న ప్రయత్నాలు

గడిచిన ఐదేళ్లలో నిర్వహణ లేకపోవడంతో ప్రధాన కాలువలపై ఉన్న వంతెనలు చాలావరకు కూలిపోయాయి. అక్కడక్కడ గండ్లు పడి కట్ట బలహీనంగా తయారైంది. తూములు ధ్వంసమయ్యాయి. ప్రధాన కాలువపై అత్యవసరంగా చేపట్టాల్సిన 11 పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆయా పనులపై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో చర్చలు జరిపారు. ఈక్రమంలో రూ.35 కోట్లు విలువైన పనులకు జలవనరుల శాఖ అనుమతులు మంజూరు చేసింది. టెండర్లు ఖరారు చేసి వచ్చే ఏడాది జనవరి నుంచి పనులు మొదలుపెట్టే అవకాశం ఉంది. రూ.35 కోట్లతో కణేకల్లు చెరువు 3వ తూము, పీఏబీఆర్, ఎంపీఆర్ డ్యాంలకు సంబంధించిన రెగ్యులేటర్లు, అండర్ టన్నెళ్లు, 5 వంతెనలు, 15 కిలోమీటర్ల మేర లైనింగ్ పనులు చేపట్టనున్నారు.

ఆధునికీకరణ పనులు ఇలా.. (రూ.కోట్లలో)



శాశ్వత ప్రాతిపదికన పూర్తి చేస్తేనే..

రాష్ట్ర ప్రభుత్వం అత్యవసరంగా చేపట్టాల్సిన పనులకు మాత్రమే అనుమతులు ఇచ్చింది. ఆధునికీకరణకు శాశ్వతప్రాతిపదికన పనులు పూర్తి చేస్తేనే ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రజాప్రతినిధులు ఆ దిశగా చొరవ చూపాల్సి ఉంది. 2007లో రూ.463 కోట్ల అంచనాతో ఆధునికీకరణ పనులు మొదలయ్యాయి. ఆరు ప్యాకేజీలుగా విభజించి 2019 నాటికి 67 శాతం పూర్తి చేశారు. ధరలు పెరగడంతో మిగిలిన పనులు పూర్తిచేయడానికి మరో రూ.450 కోట్లు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెబుతున్నారు.

వేగంగా పనులు చేయిస్తాం

- కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే, రాయదుర్గం

అత్యవసరంగా చేపట్టాల్సిన పనులపై దృష్టి సారించాం. టెండరు ప్రక్రియ పూర్తయ్యాక వేగంగా పనులు జరిగేలా చొరవ చూపుతాం. ఆరు ప్యాకేజీల పరిధిలో ఆధునికీకరణ పనులకు సంబంధించి అంచనాలు రూపొందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ప్రభుత్వం నుంచి ఆమోదం తీసుకుని వీలైనంత వేగంగా పనులు మొదలుపెడతాం. ప్రధాన కాలువను పటిష్ఠం చేసి ఆయకట్టులోని ప్రతి ఎకరాకు నీరిచ్చే బాధ్యత తీసుకుంటాం.

అంచనాలు రూపొందిస్తున్నాం

- రాజశేఖర్, ఎస్ఈ, హెచ్చెల్సీ

ప్రధాన కాలువ ఆధునికీకరణపై ఇప్పటికే జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో సమావేశమయ్యాం. ఆరు ప్యాకేజీల్లోని పెండింగ్ పనులు పూర్తిగా ఎంత ఖర్చవుతుందో అంచనాలు రూపొందించాలని మంత్రి ఆదేశాలిచ్చారు. ఆ మేరకు అంచనాలు రూపొందిస్తున్నాం. 2019 వరకు మొత్తం రూ.309 కోట్లు ఖర్చు చేశాం. రూ.148 కోట్ల విలువైన పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ధరలు పెరగడంతో అంచనాలు రూ.450 కోట్లకు పెరిగే అవకాశం ఉంది. వీలైనంత వేగంగా ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుని పనులు మొదలుపెడతాం.

పీజీ సీట్లు 1064.. భర్తీ 296

ఎస్కేయూలో ప్రవేశాలు అంతంతే..

- పీజీ కోర్సుల్లో అప్లయిడ్ మ్యాథమాటిక్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, అప్లయిడ్ ఎకనామిక్స్, వ్యాయామవిద్యలో ఒక్క విద్యార్థి చేరలేదు.
- పాలిమార్ సైన్స్‌లో ఒకరు, వయోజన విద్యలో ఇద్దరు, తెలుగు, హిందీ, గ్రామీణాభివృద్ధిలో ముగ్గురు చొప్పున విద్యార్థులు చేరారు. గతంలో ఆయా కోర్సుల్లో ప్రవేశాలు లభించడమే కష్టంగా ఉండేది. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

ఎస్కేయూ, న్యూస్‌టుడే

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశాలు గణనీయంగా తగ్గాయి. మొత్తం 33 విభాగాలకుగాను 1064 పీజీ సీట్లు ఉన్నాయి. అందులో 296 మంది విద్యార్థులే ప్రవేశం పొందారు. 2024-పీజీసెట్ కౌన్సెలింగ్ ముగిసింది. సీట్లు మిగిలిపోవడంతో ఈనెల 19 నుంచి తక్షణ ప్రవేశాల ప్రక్రియ నిర్వహించారు. కేవలం 15 మంది విద్యార్థులు చేరారు. మొత్తంగా 768 సీట్లు భర్తీ కాలేదు. సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలు తగ్గిపోయాయి. ఇందులో 18 విభాగాలకు సంబంధించి 454 సీట్లు ఉండగా 206.. ఆర్ట్స్ గ్రూపుల్లో 610 సీట్లకుగాను 90 భర్తీ అయ్యాయి. 50 శాతం కూడా కాలేదు. 2023-24 విద్యాసంవత్సరంలో పరిశీలిస్తే 320 మంది ప్రవేశాలు పొందారు. ఈసారి గతేడాది కన్నా తక్కువగా ఉండటం గమనార్హం.



గత వైకాపా ప్రభుత్వ నిర్వాకంతో...

గతంలో పీజీ, పీహెచ్‌డీ ప్రవేశాలకు ఎస్కేయూ సెట్ నిర్వహించే వారు. ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల విద్యార్థులు ఎస్కేయూలో చేరడానికి ఆసక్తి చూపేవారు. గత వైకాపా ప్రభుత్వం అన్ని విశ్వవిద్యాలయాలకు కలిపి రాష్ట్ర వ్యాప్తంగా పీజీసెట్ నిర్వహిస్తూ వచ్చింది. ఏ విశ్వవిద్యాలయంలో సీటు వస్తుందో తెలియని పరిస్థితి. దూరంగా ఉన్న జిల్లాల విద్యార్థులు ఎస్కేయూకు రావడానికి ఇబ్బందిగా మారింది. గతంలో విద్యార్థులకు ప్రభుత్వం అందించే బోధన ఫీజులు, ఉపకారవేతనాలు వర్సిటీ ఖాతాలో జమ చేసేవారు. జగన్ ప్రభుత్వం ఉపకారవేతనాలు, బోధనారుసుం విద్యార్థుల తల్లుల ఖాతాలో చేస్తున్నట్లు ప్రకటించింది. ఏడాదికి రెండుసార్లు జమ చేస్తున్నట్లు చెప్పారు. సక్రమంగా జమ చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులపై భారం పడుతోంది. గ్రామీణ, పేద విద్యార్థులు చేరడానికి ఆసక్తి చూపడంలేదు. మరోవైపు ఖాళీగా ఉన్న బోధన ఉద్యోగాలు భర్తీ చేయలేదు. బోధన సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులు ఎస్కేయూలో చేరడానికి ఆసక్తి చూపడం లేదు.

వైద్య ధ్రువపత్రానికి ఎన్నెన్ని కష్టాలో!

మెడికల్ బోర్డు ధ్రువపత్రం పొందేందుకు శుక్రవారం అనంతపురంలోని సర్వజన వైద్యశాలకు వచ్చిన రోగులు, వారి సహాయకులు అష్టకష్టాలు పడ్డారు. రోగులను తరలించేందుకు వీల్‌ఛైర్‌లు, స్ట్రెచర్లు అందుబాటులో లేవు. వారిని ఓపీ విభాగాల వద్దకు తీసుకెళ్లేందుకు సహాయకులు తమ చేతుల మీద ఎత్తుకుని తీసుకెళ్లారు. మంచానికే పరిమితమైన రోగులకు ప్రభుత్వం ఎన్టీఆర్ పింఛను కానుకగా నెలకు రూ.15 వేలు ఇస్తామని ప్రకటించింది. సంబంధిత రోగులు పింఛన్ పొందాలంటే మెడికల్ బోర్డు ధ్రువపత్రం పొందాల్సి ఉంటుంది. వైద్యులు రోగులను పరీక్షించి వారికి ధ్రువపత్రాలు జారీ చేయాలి. పీడియాట్రిక్ విభాగానికి సంబంధించి రూం నంబరు 5, ఆర్థో, న్యూరోసర్జరీ విభాగాలకు సంబంధించి రోగులకు గది నంబరు 9లలో వైద్యులు రోగులను పరిశీలించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ఎక్కువ మంది రావడంతో రోగులు, సహాయకులతో ఆయా గదుల వద్ద కిక్కిరిసిపోయింది. ప్రతి మంగళవారం, శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు సర్టిఫికెట్లు జారీ చేస్తారని సూపరింటెండెంట్ ప్రకటన ఇవ్వటంతో రద్దీ పెరిగింది. సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావును సంప్రదించగా ఆసుపత్రిలో వీల్‌ఛైర్, స్ట్రెచర్లను అందుబాటులో ఉంచామని ఎక్కువ మంది రావటంతో పరిస్థితి కొంత ఇబ్బందిగా మారిందని తెలిపారు. **- న్యూస్‌టుడే, అనంతపురం (వైద్యం)**



రోగిని ఎత్తుకొస్తున్న సహాయకులు



రోగులు, వారి సహాయకులతో రద్దీ

ఒకే బ్లాక్ స్పాట్‌లో 13 ప్రమాదాలా?


కలెక్టర్, ఎస్పీ తీవ్ర అసంతృప్తి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో గుర్తించిన ఒక 'బ్లాక్ స్పాట్'లో ఒకే సంవత్సరంలో ఏకంగా 13 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ఘటనల్లో 15 మంది మృతి చెందారు. గుర్తించిన ఒకే బ్లాక్ స్పాట్లల్లోనూ 13 ప్రమాదాలు జరగడం ఏమిటి.. అని కలెక్టర్ వినోద్‌కుమార్, జిల్లా ఎస్పీ జగదీశ్ తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్సు హాలులో జిల్లా స్థాయి రహదారుల భద్రత కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్, ఎస్పీలు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నిర్మూలన కోసమే బ్లాక్ స్పాట్లను గుర్తించాలని చెప్పాం. ఇప్పటికే కొన్నింటిని గుర్తించారు. లైటింగ్, బోర్డులు, సిగ్నల్.. వంటి వాటిని ఏర్పాటు చేయాలి. ఇంకా ఏమైనా అవసరం అనుకుంటే గుర్తించి తగిన ప్రతిపాదనలు పంపాలన్నారు. ఒకే బ్లాక్‌స్పాట్లలో తరచూ జరిగిన ప్రమాదాలపై దృష్టి, నిఘా లేనట్లు స్పష్టమవుతోందన్నారు. దీనిపై లోతుగా విచారణ చేయాలని సంబంధిత ఇంజినీరింగు విభాగాన్ని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సులు అతివేగంగా నడుపుతున్నారు. ఇవే ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. సత్వరమే డ్రైవర్లకు తగిన ఆదేశాలు ఇవ్వాలని ఆర్టీసీ ఆర్ఎంకు సూచించారు. అనంత నగరంలో సత్వరమే 40 సీసీ కెమెరాలు అమర్చాలన్నారు. టెండర్లు పిలిచి పనులు అప్పగించాలని కలెక్టర్ నగర కమిషనర్‌కు సూచించారు.

కార్డుదారులకు కందిపప్పు వచ్చేసింది

ఉమ్మడి జిల్లాకు 1,215 మెట్రిక్ టన్నులు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో చౌకధరల దుకాణాలు	3,012
కార్డులు సంఖ్య :	12,08,293



రాంనగర్, (అనంతపురం) న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వం కార్డుదారులకు కందిపప్పు ఎగ్గొట్టింది. బహిరంగ మార్కెట్‌లో పప్పు ధరలు పెరిగిపోయాయి. పేద, మధ్య తరగతి కుటుంబాలకు పప్పన్నం దూరం చేశారు. కొని తినలేని పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక రాష్ట్ర స్థాయిలోనే టెండర్లు పిలిచారు. కచ్చిత తూకాలు, నాణ్యమైన సరకు సరఫరా చేసే గుత్తేదారులకు బాధ్యతలు అప్పగించారు. ఈ నెలలో 50 శాతం కందిపప్పు పంపిణీ చేశారు. నవంబరుకు పూర్తిస్థాయిలో ఎంఎల్ఎస్ పాయింట్లకు చేరింది. ఇప్పటికే పౌరసరఫరాల సంస్థ అధికారులు చౌక ధరల దుకాణాలకు జోరుగా సరఫరా సాగుతోంది. బియ్యంతోపాటు కందిపప్పు, పంచదార, జొన్నలు పంపిణీ చేయనున్నారు.

బియ్యం బదులు జొన్నలు

- వచ్చే నెల నుంచి అన్ని కార్డులపై కిలో రూ.67 చొప్పున కందిపప్పు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఏఏవై కార్డుదారులకు పంచదార కిలో రూ.14, మిగిలిన కార్డుదారులకు అర కిలో రూ.17, చొప్పున అందించనున్నారు. బియ్యం బదులు జొన్నలు చౌకధరల దుకాణాల్లో అందుబాటులో ఉంచారు. ప్రతి కార్డుదారునికి 3 కిలోల చొప్పున పంపిణీ చేయనున్నారు.

బఫర్ నిల్వలు తొలగించండి

- గత వైకాపా ప్రభుత్వ హయాంలో డీలర్లు బియ్యం అమ్ముకున్నారు. ఆ ప్రభావం కూటమి ప్రభుత్వంలో ఏర్పాటైన డీలర్లపై భారం పడింది. పౌరసరఫరాల సంస్థ అధికారులు బఫర్ నిల్వలు పట్టుకుని చౌకధరల దుకాణాలకు బియ్యం సరఫరా చేస్తున్నారు. కార్డుదారులకు బియ్యం తూకాల్లో తక్కువ వేయడంతో ఇబ్బందిగా మారిందని కొత్త డీలర్లు వాపోతున్నారు. వైకాపా ప్రభుత్వంలో డీలర్లు బియ్యం అమ్ముకున్నారని, కూటమి ప్రభుత్వంలో నియమించిన డీలర్లతో ఆ సొమ్ము వసూలు చేస్తున్నారనే అంశంలో వివాదం నెలకొంది. కనీసం అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

పూర్తిస్థాయిలో సరకులు సరఫరా..

- రమేశ్‌రెడ్డి, వంశీకృష్ణారెడ్డి- మేనేజర్లు (పౌరసరఫరాల సంస్థ)

రేషన్ కార్డుదారులకు నవంబరు నెలకు సంబంధించి సరకులు పూర్తిస్థాయిలో వచ్చాయి. ఉమ్మడి జిల్లాకు మొత్తం 24 వేల మెట్రిక్ టన్నులు కేటాయింపులు జరిగాయి. అవి గోదాములకు చేరుతున్నాయి. వచ్చినవి వచ్చినట్లుగా చౌక ధరల దుకాణాలకు లారీల్లో తరలిస్తున్నాం. ఈ నెల 31 లోపు అన్ని దుకాణాలకు చేర్చేలా చర్యలు తీసుకుంటున్నాం. నవంబరు ఒకటో తేదీ నుంచి సరకుల పంపిణీకి చేసేందుకు చర్యలు తీసుకున్నాం.

విభిన్న ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్

● ఇంటి నుంచే ఆన్‌లైన్ వ్యాపారం ● మహిళల ఉపాధికి ఊతం

అశోక్‌నగర్ (అనంత సంక్షేమం), న్యూస్‌టుడే: పరిశ్రమలు పెట్టి ఉత్పత్తులను సులువుగా తయారు చేసినా మార్కెటింగ్ చేయడం కష్టతరమయ్యేది. డ్వాక్రా మహిళా గ్రూపులు తయారు చేసిన వాటికి సరైన మార్కెటింగ్ సౌకర్యం ఉండేది కాదు. దీంతో విభిన్నంగా ఉన్నా స్థానికంగానే విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల ఆర్థికాభివృద్ధిపై దృష్టి సారించారు. పలు సరికొత్త మార్కెటింగ్ విధానాలను తెరపైకి తీసుకొచ్చి మహిళలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దే దిశగా తొలి అడుగుపడింది. ఇప్పుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ అవకాశాలు కల్పించి. ఈ-కామర్స్‌లో విక్రయించుకొనే విధంగా అవకాశాలు కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సెర్ప్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇందుకు అనుగుణంగా అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది.



అలంకరణ సామాగ్రి తయారుచేస్తూ..

గుర్తించిన ఉత్పత్తులివీ..

గృహాలంకరణ వస్తువులు, తినుబండారాలు ఏవైనా గ్లోబల్ మార్కెట్‌లో ప్రవేశించాలంటే ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) వేదిక ద్వారా సాధ్యం. ఈ విధానంలో ఇంట్లో నుంచే విక్రయాలు సాగించవచ్చు. ప్రస్తుతం లావాదేవీలు ఆన్‌లైన్ డిజిటల్ తరహాలో ఉన్నాయి.

● గార్లదిన్నె, నార్పల, రాప్తాడు, బుక్కరాయసముద్రం, అనంతపురం, డి.హీరేహాళ్, యాడికి, కంబదూరు, పామిడి తదితర ప్రాంతాల్లో వేరుసెనగ, ఆముదం, సన్‌ఫ్లవర్ నూనెలు, పట్టు చీరలు, వాటర్ బాటిళ్లు, డోర్ కర్టెన్లు, గార్మెంట్స్, ఫినాయిల్, స్వీట్లు, బిస్కెట్లు, మిల్లెట్స్, ఫ్లోర్ క్లీనర్ టూవీలర్ బ్యాగులు, లెదర్ బొమ్మలు, బెల్లం, మసాల పౌడర్లు గుర్తించారు. నాణ్యత, నవ్యతతో కూడిన ఉత్పత్తులకు ఎక్కడైనా డిమాండ్ ఉంటుంది. పలు రకాల ఉత్పత్తులు మంచి గుర్తింపు వస్తోంది.

● గార్లదిన్నెలో చిరుధాన్యాలతో తయారు చేసిన రాగి మాల్టు, చిక్కీలు, నిప్పట్లు ఇప్పటికే ఓఎన్‌డీసీలో పొందుపరిచారు.

● రుద్రంపేటలో తయారు చేసే గిఫ్ట్‌లు, గృహ అలంకరణ వస్తువులను ఆన్‌లైన్‌లో ఉంచారు.

● రాప్తాడు మండలంలో బిస్కెట్లు తయారీలో మహిళలు ముందుంటున్నారు. జన్మభూమి నగర్‌కు చెందిన ముత్యాలమ్మ మహిళా సంఘం సభ్యురాలు సుమియా డోర్ డెకరేషన్ ఫ్లవర్స్‌ను ఉత్పత్తి చేస్తూ అమ్మకాల్లో ముందుంటోంది.



బుక్కరాయ సముద్రంలో గంగేశ్వరి నిర్వహిస్తున్న ఫ్లోర్ క్లీనింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న డీపీఎం గంగాధర్

రెండు రకాలుగా విక్రయాలు

అనంతపురం బళ్లారి బైపాస్‌లో దుకాణం ఏర్పాటు చేశాం. 8 సంవత్సరాలుగా దీన్ని నిర్వహిస్తున్నాం. ఓఎన్‌డీసీతో పొందు పరచడంతో బాగా ఉపయోగ ఉంటోంది. షాపులో అమ్మడంతోపాటు ఆన్‌లైన్‌లో కూడా విక్రయాలు సాగిస్తున్నాం. - **ఖైరున్‌బీ, అనంతపురం**

నిరంతర ప్రక్రియ - ఈశ్వరయ్య, డీఆర్‌డీఏ పీడీ

కలెక్టరు ఆదేశాల మేరకు జిల్లాలో తయారు అవుతున్న ఉత్పత్తుల్ని గుర్తించే ప్రక్రియ సాగుతోంది. ప్రధానంగా ప్రతి ఉత్పత్తికి బ్రాండ్ పేరు ఉండటంతోపాటు మెయిల్ ఐడీ, ఫోన్ నంబరు, పాన్‌కార్డు, ఉద్యామ్ సర్టిఫికెట్, ఫుడ్ ప్రొడక్ట్ ఎమ్ఎస్ఎమ్ఈ సర్టిఫికెట్, జీఎస్టీ, బ్యాంకు ఖాతా, ఉత్పత్తి చేసిన వాటికి సంబంధించి చూడటానికి ఆన్‌లైన్‌లో బాగా కన్పించే విధంగా మంచి ఫొటోలు, ధర, తూకం వివరాలన్నీ డీఆర్‌డీఏ అధికారులకు అందజేస్తే ఓఎన్‌డీసీలో పొందుపరుస్తారు.

అనంతపురం మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, న్యూస్‌టుడే : పండగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని అధిగమించడానికి ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు గుంతకల్లు డివిజన్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు ప్రత్యేక రైళ్లు అనంతపురం మీదుగా ప్రయాణిస్తాయని చెప్పారు. ఛప్రా- యశ్వంతపూర్ మధ్య నవంబరు 2, 9వ తేదీల్లో ప్రయాణించే రైలు (05185) కర్నూలు, అనంతపురం, ధర్మవరం మీదుగా ప్రయాణించనుంది. ఇక యశ్వంతపూర్ నుంచి ఛప్రాకు రైలు (05186) అక్టోబరు 4, 11వ తేదీల్లో అనంతపురం మీదుగా ఇదే మార్గంలో ప్రయాణిస్తుందని అధికారులు వివరించారు.

రానున్న మూడు రోజుల్లో
తేలికపాటి వర్షాలు

బుక్కరాయసముద్రం: రానున్న మూడు రోజుల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో చిరుజల్లులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని రేకులకుంట వాతావరణ కేంద్రం శాస్త్రవేత్తలు విజయ్‌శంకర్‌బాబు, నారాయణస్వామి తెలిపారు. వచ్చే ఐదు రోజులూ జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 32.8 నుంచి 33.6 డిగ్రీలుగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు 21.1 నుంచి 22.4 డిగ్రీలుగా నమోదవుతాయన్నారు. వాయువ్యం దిశగా గాలులు గంటకు 3 కిలోమీటర్ల వేగంతో వీస్తాయన్నారు. ఉదయం పూట గాలిలో తేమ 81 శాతం, మధ్యాహ్నం పూట 49 శాతం నమోదవుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు.

తడబడితే బురదలోకే..

కళ్యాణదుర్గం పట్టణంలోని బాలికోన్నత పాఠశాల ఆవరణ మడుగును తలపిస్తోంది. ఇక్కడ 3-10వ తరగతి వరకు సుమారు 860 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. సమీపంలోని కొండ నుంచి ఊటనీరు పాఠశాల ఆవరణ గుండా వెళ్తున్నాయి. దాంతో విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అడుగులు తడపడితే వారు బురదలో పడిపోయే అవకాశం ఉంది. ప్రార్థన, విరామం, భోజన సమయాల్లో వారు నీటిలో నడుచుకుంటూ వెళ్తున్నారు. ఊట నీటిని మళ్లించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఉపాధ్యాయులు తెలిపారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పరిశీలించి, సమస్య పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం


జూనియర్ న్యాయవాదులు మనోధైర్యాన్ని కోల్పోవద్దు

✦ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్

అనంతపురం (లీగల్), న్యూస్‌టుడే: జూనియర్ న్యాయవాదులు మనోధైర్యాన్ని కోల్పోరాదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ అన్నారు. జూనియర్ న్యాయవాది రుక్సానా మృతికి నివాళులు అర్పిస్తూ జిల్లా కోర్టులో సంతాప సభ నిర్వహించారు. ఈ సభకు న్యాయమూర్తులు, న్యాయవాదులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. రుక్సానా మృతి ఆ కుటుంబానికి తీరని లోటని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు, వృత్తిలో ఆటుపోట్లతో రుక్సానా మనోధైర్యాన్ని కోల్పోయిందనే భావన వ్యక్తం అవుతోందన్నారు. జూనియర్ న్యాయవాదులు వృత్తిలో ఇబ్బందులు పడకుండా సీనియర్ న్యాయవాదులు ప్రోత్సహిస్తూ మనోధైర్యాన్ని నింపాలన్నారు. ఆమె మృతి ఘటనపై నిష్పక్షపాతంగా, లోతుగా దర్యాప్తు చేపట్టాలని ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులకు సూచించామన్నారు. ఆమె తీసుకున్న నిర్ణయంతో కష్టపడి చదివించిన తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చిందన్నారు. జూనియర్ న్యాయవాదులు ఎలాంటి కష్టాలు వచ్చినా న్యాయసేవా సదన్‌లో అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు గురుప్రసాద్, సీనియర్ న్యాయవాదులు వి.జె. రవికుమార్, పీజీ విఠల్, బి.నారాయణరెడ్డి, ఎల్.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. న్యాయమూర్తులు సత్యవాణి, శోభారాణి, శివప్రసాద్ యాదవ్, శివశంకర్, సుబ్బారావు, సుజిన్‌కుమార్ పాల్గొన్నారు.

డిసెంబరు 14న లోక్ అదాలత్

ఉమ్మడి జిల్లాలోని అన్ని కోర్టుల్లో డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు డీఎల్ఎస్ఏ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్‌యాదవ్ సంయుక్త ప్రకటనలో తెలిపారు.



సాగు నీటి సంఘాల ఎన్నికలకు మోగిన నగారా

నోటిఫికేషన్ విడుదల

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: నెల రోజులుగా ఊరిస్తున్న సాగునీటి సంఘాల ఎన్నికల నగరా మోగింది. నిర్దేశిత కమిటీల ఎన్నిక కోసం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేశారు. మంగళవారం నుంచే ఈ ఎన్నికల ప్రక్రియ మొదలైనా... కీలక దశ మాత్రం నవంబరు 20 నుంచి 27 తేదీల మధ్యనే జరగనుంది. ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా తయారీపై హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ తన కార్యాలయంలో ఉప ఎస్ఈ భాస్కర్ శర్మ, తదితర అధికారులతో కసరత్తు చేపట్టారు. తొమ్మిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. తెదేపా ప్రభుత్వ హయాంలో 2015లో ఎన్నికలు జరిగాయి. తర్వాత వైకాపా ప్రభుత్వం వాటి ఊసేత్తలేదు. నీటి ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టును నిర్లక్ష్యం చేసింది.

164 కమిటీల ఎంపికపై దృష్టి

జిల్లాలో హెచ్చెల్సీ ప్రాజెక్టు పరిధిలోనే కాకుండా.. మధ్యతరహా ప్రాజెక్టు భైరవానితిప్ప(బీటీపీ), చిన్ననీటి పారుదల కింద ఉన్న చెరువులు కలిపి మొత్తం 164 కమిటీలను ఎంపిక చేయాల్సి ఉంటుంది. ఇందులో సాగునీటి సంఘాలు(డబ్ల్యూయూఏ) 149, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు(డీసీ) 12, ప్రాజెక్టు కమిటీలు మూడు ఉన్నాయి. హెచ్చెల్సీ కింద 54, బీటీపీ కింద ఆరు, చెరువుల కింద 89 ప్రకారం సాగునీటి సంఘాలు ఉన్నాయి. హెచ్చెల్సీ ప్రాజెక్టులో మాత్రమే 12 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 503 గ్రామాలు ఉంటే... సాగునీటి సంఘాల పరిధిలో 353 గ్రామాలు ఉండటం విశేషం. మొత్తం ఆయకట్టు 2,08,007 ఎకరాలు. ఇందులో అత్యధికంగా హెచ్చెల్సీ ప్రాజెక్టు కిందే 1,66,186 ఎకరాలు ఉంది. బీటీపీ కింద 12,001, ఎన్నికలు జరిగే చెరువుల కింద 29,820 ఎకరాల ప్రకారం ఉంది. జిల్లాంతటా అన్నదాతలు ఎన్నికల్లో భాగస్వామ్యం కానున్నారు.

అనంత జిల్లాలో ఇలా..

ప్రాజెక్టు	సంఘాలు	ఆయకట్టు (ఎకరాల్లో)
భారీ	54	1,66,186
మధ్యతరహా	06	12,001
చిన్నతరహా	89	29,820

షెడ్యూల్ ఇదే..

ఈనెల 21 నుంచి 31వ తేదీ దాకా ఓటర్ల జాబితా తయారీ, ఎన్నికల అధికారుల నియామకం, కమిటీ ప్రాంతాలు ఖరారు చేస్తారు. నవంబరు 1 నుంచి 3 మధ్యన నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు స్వీకరణ, పరిష్కారం చేస్తారు. 3-5 తేదీల మధ్యలోనే డిస్ట్రిబ్యూటరీ, ప్రాజెక్టు కమిటీల జాబితాలను ఖరారు చేస్తారు. 6-11 మధ్యన ఓటరు జాబితా సిద్ధం చేస్తారు. 11, 12న జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి, 13న పరిష్కరిస్తారు. అదే రోజు తుది జాబితా విడుదల చేస్తారు. 20న అన్ని కమిటీల ఎంపికకు నోటిఫికేషన్లు జారీ చేస్తారు. 21న సాగునీటి సంఘాల ప్రతినిధుల ఎన్నిక కోసం సర్వసభ్య సమావేశాలు నిర్వహణ. అదే రోజు సాగునీటి సంఘాల అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను ఎంపిక చేస్తారు. 24న డబ్ల్యూయూఏ అధ్యక్షులు కలిసి డిస్ట్రిబ్యూటరీ కమిటీ(డీసీ) అధ్యక్ష, ఉపాధ్యక్షులను.. 27న డీసీ అధ్యక్షులు కలిసి ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌లను ఎన్నుకుంటారు.

'పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి'

ఆజాద్‌నగర్ అనంతపురం) : పత్తి ధర లేక నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని, కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. వారం క్రితం క్వింటాలు పత్తి రూ.8500 ఉండగా, ప్రస్తుతం రూ. ఆరున్నర వేలకు పడిపోయిందన్నారు. రూ. 7,250 మద్దతు ధర ప్రకటించినా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో వ్యాపారుల మోసాలకు పాల్పడుతున్నారన్నారు. పత్తి సాగు విస్తీర్ణం తగ్గిందని, విత్తనాలు, పురుగు మందుల కల్తీతో నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి బదులు కంపెనీలకు ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయన్నారు. జిల్లా ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి సీఐఐ కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కోరారు.



దేహదానంపై అవగాహన అవసరం

● ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్యరావు

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: అన్ని దానాల కన్నా దేహదానం చాలా గొప్పదని ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్యరావు తెలిపారు. శుక్రవారం అనంతపురం వైద్యకళాశాలలో అనాటమీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపల్ పాల్గొని మాట్లాడారు. మనిషి చనిపోయిన తరువాత మృతదేహాన్ని పూడ్చటమో, కాల్చటమో చేయటం ద్వారా ఎందుకు పనికిరాదన్నారు. శరీరాన్ని దానం చేయటం వల్ల వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు శరీర అంతర్ నిర్మాణ శాస్త్రాన్ని చదువుకునేందుకు ఉపయోగపడుతుందని వివరించారు. దేహదానం చేసిన వారి కుటుంబ సభ్యులకు, అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు వైద్య కళాశాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఇదే మార్గంలో వెళ్తోన్న సంజీవినీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రమణారెడ్డిని సన్మానించారు. వైస్ ప్రిన్సిపాళ్లు, వైద్యులు నవీన్, శంషాద్‌బేగం, షారోన్‌సోనియా, అనాటమీ హెచ్‌వోడీ ఉమామహేశ్వరరావు, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సంజీవిని స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రమణారెడ్డిని సన్మానిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్యరావు, వైస్ ప్రిన్సిపాళ్లు

ఆయుధాల పనితీరు తెలుసుకోవాలి: ఎస్పీ

అనంత నేరవార్తలు: పోలీసు విధుల్లో వినియోగించే ఆయుధాలు, సాధనాల పట్ల విద్యార్థి దశ నుంచే అవగాహన కల్గి ఉండటం మంచిదని ఎస్పీ జగదీశ్ అభిప్రాయపడ్డారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని షాదీఖానాలో 'ఓపెన్ హౌస్' నిర్వహించారు. పోలీసులు తమ దైనందిన విధుల్లో వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, పరికరాలను ప్రదర్శనలో ఉంచారు. ఏయే సందర్భంలో ఎలాంటి ఆయుధాన్ని వినియోగిస్తారు, వాటి పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వివిధ రకాల తుపాకులు, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్, లెటర్ బాంబు డిటెక్టర్, నార్కో డిటెక్షన్ కిట్, డ్రోన్ కెమెరాలు తదితరాలను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.



తుపాకీ పనితీరును వివరిస్తున్న ఎస్పీ జగదీశ్



ఆయుధాలను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

వ్యాసరచన పోటీలు

పోలీసు కాన్ఫరెన్సు హాలులో శుక్రవారం విద్యార్థులకు 'సైబర్ నేరాల నియంత్రణలో యువత పాత్ర 'అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోకుండా కుటుంబ సభ్యులు, పరిచయస్తులకు అవగాహన కల్పించాలని ఎస్పీ జగదీశ్ పిలుపునిచ్చారు.



ఫ్రీ హోల్డ్ భూముల దస్త్రాలు పరిశీలన

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో అడ్డదిడ్డంగా 22ఏ నిషేధిత జాబితా నుంచి విముక్తి కల్పించిన ఫ్రీ హోల్డ్ భూముల రికార్డు, దస్త్రాలను జిల్లా రెవెన్యూ యంత్రాంగం నిశితంగా పరిశీలన ముమ్మరంగా సాగుతోంది. శుక్రవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో దస్త్రాల పరిశీలన ప్రక్రియ మొదలైంది. డీఆర్ఓ రామకృష్ణారెడ్డి సారథ్యంలో రెవెన్యూ డివిజన్ల వారీగా సంబంధిత రికార్డు, దస్త్రాలను చూస్తున్నారు. ఆయా మండలాల తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, వీఆర్ఓ, తదితర అధికారులు బృందాలుగా ఏర్పడి దస్త్రాలను చూస్తున్నారు. ఇప్పటికే వీఆర్ఓ, తహసీల్దారు, ఆర్డీఓ.. దశల్లో పరిశీలన చేసి కలెక్టర్ కార్యాలయానికి పంపించారు. ఆఖరుగా నాలుగోదశ కింద కలెక్టరేట్‌లో చూసిన తర్వాత.. రాష్ట్ర భూ పరిపాలన కమిషనర్‌కు పంపిస్తారు. జిల్లాలో 34 వేల ఎకరాలు ఫ్రీ హోల్డ్ చేశారు. ఇందులో 111 ఎకరాలు రిజిస్ట్రేషన్ అయినట్లు తేల్చారు. ఈ రెండింటిలో ఎన్ని ఎకరాలు నిర్దేశిత జీవోకు విరుద్ధంగా నిషేధిత జాబితా నుంచి విముక్తి కల్పించారో తేల్చడానికే ఈ పరిశీలన సాగుతోంది.

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

కొత్త పింఛన్లపై ప్రణాళికలు సిద్ధం చేయండి

డి.హీరేహాళ్ (రాయదుర్గం పట్టణం), న్యూస్‌టుడే: ప్రభుత్వం జనవరిలో కొత్త పింఛన్లు మంజూరు చేస్తున్నందున గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు కొత్త పింఛన్లపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో దాసానాయక్ సూచించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సాధారణ సమావేశం ఎంపీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త పింఛన్లకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని, గ్రామాల్లో సీసీ రోడ్లు, పశువుల షెడ్లు, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం వివిధ శాఖల ప్రగతిని అధికారులు వివరించారు. తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు గంగారెడ్డి, మల్లికార్జున, అనిత, యు.అనిత, తిప్పేస్వామి, సర్పంచులు గంగన్న, లక్ష్మీదేవి, రామలక్ష్మి, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగమేళాకు స్పందన

ఉరవకొండ, న్యూస్‌టుడే: మండలంలోని చిన్న ముష్టూరు వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం మంత్రి పయ్యావుల కేశవ్ ఆధ్వర్యంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించిన ఉద్యోగ మేళాకు విశేష స్పందన లభించిందని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సురేశ్ బాబు తెలిపారు. 135 మంది నిరుద్యోగులు హాజరు కాగా, 78 మందికి ఆయా కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు వివరించారు. వారందరికీ నియామక పత్రాలను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి సులోచన, ప్రాంగణ నియామక అధికారి అలియాస్ హుసేన్, నైపుణ్యాభివృద్ధి సంస్థ స్థానిక సమన్వయకర్త జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **రాయదుర్గం పట్టణం:** పట్టణంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా ఏర్పాటు చేశారు. 30పైగా కంపెనీల ప్రతినిధులు హాజరై 216 మంది అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు తెలిపారు.

తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

● రాయదుర్గం మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి

● 'ఈనాడు ఫోన్‌ఇన్'కు విశేష స్పందన



రాయదుర్గం, న్యూస్‌టుడే: రాయదుర్గం పురపాలికలో తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామని మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం 'ఈనాడు- మేమున్నాం. మీకు తోడుగా' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించింది. ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ దృష్టికి తెచ్చారు. ప్రధానంగా అపరిశుభ్రత, తాగునీరు, వీధి దీపాలు, కుక్కలు, పందుల బెడద, రహదారులు తదితర సమస్యలు విన్నవించారు. అన్నింటికి కమిషనర్ సమాధానాలిస్తూ.. పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.





? లక్ష్మీబజారు, వాల్మీకినగర్, వెంకటేశ్వర కాలనీల్లో వీధి దీపాలు సక్రమంగా వెలగటం లేదు. **- రఫీక్, నాగరాజు, తిమ్మప్ప**

✔ దీపాల ఏర్పాటుకు టెండర్లు పిలిచాం. ప్రక్రియ పూర్తి కాగానే పరిష్కరిస్తాం.

? భంభంబాబా స్వామి లేఅవుట్, భావన స్కూలు రాగిమాను ఏరియా వద్ద 10వ వార్డు, సెయింట్‌పాల్ స్కూలు, చౌడేశ్వరి కాలనీ వద్ద కల్వర్టులు దెబ్బతిన్నాయి. వాటిని పునర్నిర్మించాలి. **- లోకేశ్, మహేశ్, పొరాళు పురుషోత్తం, బాబు(10వ వార్డు)**

✔ సాధారణ నిధులతో దశల వారీగా కల్వర్టుల నిర్మాణం చేపడతాం.

? సిద్ధేశ్వరకాలనీ, ఎస్‌సీపీ లేఅవుట్, ఆంజనేయస్వామి లేఅవుట్, నేసేపేట తదితర కాలనీల్లో భారీ వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయి. మరమ్మతులు చేయండి. **- దాసరి ఓబుళేసు, మహబూబ్‌బాషా, రాధాకృష్ణ, ఎర్రిస్వామి, మునిస్వామి**

✔ రూ.95లక్షలతో రోడ్ల మరమ్మతులకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదంతో ప్రతిపాదించాం. ఆమోదం తర్వాత మరమ్మతులు చేపడతాం.

? రాజీవ్‌గాంధీ కాలనీలో కల్వర్టుల కింద పూడిక తీయక పోవటంతో మురుగు రోడ్లపై ప్రవహిస్తుంది. శుభ్రం చేయించాలి. **- హంపన్న, ఓబుళేశు, శ్రీరాములు, శ్రీనివాసులు (రాజీవ్‌గాంధీ కాలనీ)**

✔ పూడిక తీయించి మురుగు పారేలా చర్యలు తీసుకుంటాం.

? వాల్మీకినగర్, బీటీపీ రోడ్డు, చెక్‌పోస్టు, డ్రైవర్ల కాలనీ, సిద్ధేశ్వర కాలనీ, శివారు ప్రాంతాల్లోని ఎస్‌సీపీ లేఅవుట్, పైతోటలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. **- రామాంజనేయులు, సిద్దన్న(పైతోట), తిప్పేస్వామి (వాల్మీకినగర్)**

✔ పైతోటకు నేషనల్ హైవే నిధులు రూ.83లక్షలతో పైప్‌లైన్ ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తాం. శివారు కాలనీలకు అమృత్-2 నిధులతో నీటి ట్యాంకులు నిర్మించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

? పట్టణంలో తాగునీటిని 45 నిమిషాలు మాత్రమే వదులుతున్నారు. ఎక్కువ సమయం వదలాలి. వేణుగోపాల్ స్వామి గుడి ఏరియాలో అపరిశుభ్రత నెలకొంది. శుభ్రం చేయాలి. ప్రధాన రోడ్లపై పశువులు, పందులు, గాడిదలు, కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలి. **- నాగార్జున, నాగరాజా నాయక్, ప్రదీప్**

✔ వాటి నివారణకు తప్పక చర్యలు తీసుకుంటాం.

? వేంకటేశ్వర కాలనీలో మురుగు కాలవలు, సిమెంట్ రోడ్లు, సరైన తాగునీటి వ్యవస్థ లేక ఇబ్బందులకు గురవుతున్నాం. **- తిప్పేస్వామి, మారెక్క, మల్లక్క, ఉస్మాన్‌సాబ్, ఆటో నాగరాజు (వేంకటేశ్వరకాలనీ)**

✔ వెంటనే ఫిట్టర్లు, ఎలక్ట్రీషియన్ సిబ్బందిని వేంకటేశ్వర కాలనీకి పంపించారు. విద్యుత్తు మోటార్ స్టార్టర్‌కు మరమ్మతులు చేయించారు. దాని చుట్టూ పెరిగిన కంప, పిచ్చి మొక్కలను తొలగించారు.

? కె.బిప్యాలెస్ రోడ్డులో మద్యం దుకాణాలతో, మటన్ మార్కెట్‌లో చికెన్ వ్యాపారులు వ్యర్థాలను రోడ్లపై వేస్తున్నారు. అక్కడ కుక్కల బెడద అధికమై ప్రజలను గాయపరుస్తున్నాయి. **- బంగి శివ, మల్లికార్జున, నాగరత్న, పుష్పలత**

✔ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర, మున్సిపల్ సిబ్బంది సుధీర్ వెంటనే స్పందించి వ్యాపారులను హెచ్చరించారు. చెత్త బుట్టల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.

? మల్లాపురం లేఅవుట్‌లో, వాల్మీకి నగర్‌లో వీధి దీపాలు లేక రాత్రిళ్లు ఎలుగుబంట్లు సంచరిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. వీధి దీపాలు, సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయండి. **- మధు, చేనేత కార్మిక సంఘం పట్టణాధ్యక్షుడు**

✔ వారంలోపు వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం. నిధుల లభ్యతను బట్టి సీసీ రోడ్లు నిర్మిస్తాం.

? గాంధీ సర్కిల్, ఓబుళాచారి రోడ్డుపై కూరగాయల విక్రయాలతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లెత్తుతున్నాయి. **- శేషాద్రి, హనుమంతు, నారాయణ, మౌనిక**

✔ కూరగాయల క్రయవిక్రయాలు రోడ్లపై జరగకుండా ఇతర ప్రాంతానికి తరలిస్తాం. ట్రాఫిక్ సమస్యలు తొలగిస్తాం.

? భంభంబాబా కాలనీ, ముత్రాశి కాలనీ, మొలకాల్మూర్ రోడ్డులో మురుగు కాలువలు, కల్వర్టులు, సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలి. **- మల్లికార్జున, తిప్పేస్వామి, పొరాళు ధనార్జున, పాండు, ఉస్మాన్**

✔ **కమిషనర్:** ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటాం.

దేవాలయ కమిటీల్లో నాయీబ్రాహ్మణులకు అవకాశంపై హర్షం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: దేవాలయ కమిటీల్లో నాయీబ్రాహ్మణులకు అవకాశం కల్పించడం హర్షణీయమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రజావేదిక వద్ద సీఎం చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. సంఘం నాయకులు తిమ్మప్ప, నరసింహులు, సుధాకర్, సభ్యులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని, సంఘం నాయకులు

● పశుగణన కార్యక్రమ గోడ పత్రాలను ప్రజావేదిక వద్ద ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు శ్రీనివాస గుప్తా ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రజల సమస్యలపై వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించేలా చర్యలు తీసుకొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

రాయదుర్గం పట్టణం: 9666888046, కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661, ఉరవకొండ: 8008573071

సమస్య: బెళుగుప్ప గ్రామంలోని వినాయక దేవాలయం వెనుక వైపు విద్యుత్తు తీగలు ఇంటికి తాకుతున్నాయి. వాటిని పక్కకు మార్చి, ఎత్తు పెంచాలి. **- శ్రీరాములు**



సమాధానం: తగిన చర్యలు తీసుకుంటాం. **- గంగాధర్, ఏఈ**

సమస్య: బెళుగుప్ప నుంచి తగ్గుపర్తి వెళ్లే రహదారి పెద్ద వంక వద్ద కోతకు గురైంది. రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. **- నరేశ్**

సమాధానం: మరమ్మతులు చేయిస్తాం. **- చంద్రశేఖర్, ఏఈఈ, ఆర్‌అండ్‌బీ**

సమస్య: కళ్యాణదుర్గం పట్టణంలోని రాయదుర్గం రోడ్డులో నగర వనం సమీపంలో ఉన్న చేతిపంపులో నీరు రాకపోవడంతో వదిలేశారు. వినియోగంలోకి తీసుకురావాలి. **- రామ్మోహన్**

సమాధానం: మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెస్తాం. -

– న్యూస్‌టుడే, బెళుగుప్ప, కళ్యాణదుర్గం

మెరుగైన వైద్య సేవలు అందించాలి

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: పట్టణ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ప్రోగ్రాం అధికారి, వైద్యుడు రాజేశ్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఇందిరమ్మ కాలనీలోని ఆసుపత్రిలో పట్టణ ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. వైద్యుడు, సీడీపీఓ లక్ష్మీప్రసన్న, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ పాల్గొన్నారు. ఆసుపత్రుల్లో ఎలాంటి అవసరాలు ఉన్నాయనే దానిపై చర్చించారు.

కూలిన ఆలయ ప్రహరీ

కంబదూరు, న్యూస్‌టుడే: జెక్కిరెడ్డిపల్లి గ్రామ సమీపాన వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం గోడ కూలింది. పురాతన దేవాలయం కావడంతో గోడ శిథిలావస్థకు చేరింది. ఇటీవల కురిసిన వర్షాలకు అది కూలిపోయింది. ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదు. గ్రామానికి చెందిన రాజశేఖరరెడ్డి వంశీయులు ఆలయంలో పూజలు కొనసాగిస్తున్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

కళ్యాణదుర్గం: పట్టణానికి చెందిన వన్నూరబీ ఇటీవల అనంతపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఆమెకు కాలు విరగడంతో బంధువులు ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి శస్త్ర చికిత్స అవసరం అని చెప్పారు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో కళ్యాణదుర్గంకు చెందిన ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు బద్దేనాయక్ స్పందించి రూ.20 వేలు సాయం అందించారు. శుక్రవారం ట్రస్టు ప్రతినిధులు సురేష్, కార్యదర్శి హరీష్, ట్రెజరర్ అబ్దుల్ వహాబ్, సభ్యులు బాధితురాలికి అందజేశారు.

చిరుత దాడిలో పొట్టేలు మృతి

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలోని ముదిగల్లు రోడ్డులో ఉన్న శ్రీరామిరెడ్డి నీటి పథకం పంప్‌హౌస్ వద్ద రామాంజి గొర్రెల మంద ఏర్పాటు చేసుకున్నారు. శుక్రవారం కొండ ప్రాంతంలో నుంచి వచ్చిన చిరుత మందపై దాడి చేసి పొట్టేలును చంపేసింది. అటవీశాఖ సెక్షన్ అధికారి షాన్‌వాజ్, వాచర్లు అక్కడికి చేరుకొని చిరుత అడుగు జాడలు పరిశీలించారు.

కిరాణ దుకాణంలో చోరీ

ఉరవకొండ: పెన్నహోబిలంలో ఈశ్వరమ్మకు చెందిన జనరల్ దుకాణంలో చోరీ జరిగింది. శుక్రవారం దుకాణం తెరవగా చోరీ జరిగినట్లు గుర్తించారు. రూ.50వేల నగదు, రెండు తులాల బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సురేశ్‌బాబు దుకాణాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు.

యువకుడిపై దాడికి యత్నం

విడపనకల్లు(ఉరవకొండ): విడపనకల్లు మండలం పాల్తూరులో ఓ యువకుడిపై పలువురు శుక్రవారం దాడికి యత్నించారు. అతడు ఇటీవల ఓ యువతిని ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. యువతి బంధువుల ఇంటి ముందు రెచ్చగొట్టే ధోరణిలో యువకుడు తిరుగుతుండగా కోపోద్రేక్తులైన వారు కొడవళ్లతో దాడికి యత్నించారు. అతడు తప్పించుకొని పరారయ్యాడు. ఈ ఘటనపై విచారిస్తున్నామని గ్రామీణ సీఐ చిన్న గౌస్ తెలిపారు.


ఇసుక టిప్పర్లను అడ్డుకున్న అధికారులు

కణేకల్లు, న్యూస్‌టుడే: కణేకల్లు వద్ద వేదవతి హగరి, హెచ్చెల్సీ వంతెనపై భారీ ఇసుక టిప్పర్ల రాకపోకలను అధికారులు శుక్రవారం అడ్డుకున్నారు. రచ్చుమర్రి ఇసుక నిల్వ కేంద్రం నుంచి ఇసుక తీసుకెళ్లేందుకు వారం రోజులుగా వంతెనపై టిప్పర్ల తాకిడి ఎక్కువైంది. హెచ్చెల్సీ జలాల ప్రవాహం నేపథ్యంలో వంతెన భద్రత దృష్ట్యా టిప్పర్లను నిలువరించేలా డీఈ మద్దిలేటి చర్యలు చేపట్టారు. టిప్పర్లు ఒక్కసారిగా వరుస కట్టడంతో జేఈ నరేంద్ర మారుతి సిబ్బందితో కలిసి అడ్డుకుని వెనక్కు పంపించేశారు.

ట్యూబ్‌లైట్లు వెలగవు.. పంకాలు తిరగవు

● ఆరోగ్య కేంద్రంలో రోగులకు తప్పని ఇక్కట్లు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం సామాజిక ఆరోగ్య కేంద్రంలోని వార్డులో హైఓల్టేజీతో స్విచ్‌బోర్డు కాలిపోయి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. దాంతో ట్యూబ్‌లైట్లు వెలగక, పంకాలు తిరగకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత 15 రోజులుగా ఈ సమస్య ఉంది. ఆసుపత్రిలో రోజూ 650-700 వరకు ఓపీ ఉంటుంది. సుమారు 40-50 మంది వరకు రోగులు అడ్మిట్ అవుతుంటారు. పగలు ఉక్కపోతతో, రాత్రిళ్లు దోమల బెడదతో అవస్థలు పడుతున్నట్లు రోగులు, వారి సహాయకులు వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో జ్వరాలు, పలు వ్యాధులతో రోగులు వస్తున్నారు. సమస్యను పలుమార్లు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఉద్యోగులు చెబుతున్నారు. ఈ విషయమై వైద్యాధికారిణి ప్రసన్నభారతిని వివరణ కోరగా జిల్లా అధికారులు వచ్చి పరిశీలించారు. త్వరలోనే సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.



కాలిపోయిన స్విచ్‌బోర్డు



వార్డులో చికిత్స పొందుతున్న రోగులు

కుప్పకూలిన కల్వర్టు

బ్రహ్మసముద్రం: మండలంలోని సూగేపల్లి గ్రామానికి ఆనుకొని ఉన్న వంకలో కల్వర్టు ఇటీవల కురిసిన వర్షానికి శుక్రవారం ఉదయం ఒక్కసారిగా కూలిపోయింది. ఆ సమయంలో వాహన రాకపోకలు లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది. సూగేపల్లి నుంచి కోనాపురం గ్రామాలకు వెళ్లే దారిలో రాకపోకలు నిలిచిపోయాయి. కళ్యాణదుర్గం డివిజన్ పంచాయతీరాజ్ డీఈ రాజన్న, ఏఈ విజయకృష్ణ, ఎంపీడీఓ నందకిశోర్, సర్పంచి వనిత కూలిన కల్వర్టును పరిశీలించారు. పనులు వెంటనే చేపట్టాలని డీఈ సిబ్బందికి ఆదేశాలిచ్చారు.

హెచ్చెల్సీలో దూకిన వృద్ధురాలు.. కాపాడిన యువకుడు

కణేకల్లు, న్యూస్‌టుడే: డి.హీరేహాళ్ మండలం దొడగట్టకు చెందిన వన్నూరమ్మ(70) శుక్రవారం కణేకల్లు వద్ద హెచ్చెల్సీలోకి దూకి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన యువకుడు ఆమెను కాపాడి గట్టుకు చేర్చాడు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. వృద్ధురాలికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారులు, కోడళ్లు తన పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని మనస్తాపం చెందింది. మండలంలోని కళేకుర్తిలో ఉన్న కుమార్తె వద్దకు వెళ్తానని చెప్పి ఆటోలో కణేకల్లుకు చేరుకొంది. బస్టాండు నుంచి కళేకుర్తివైపు నడుకుంటూ వెళ్తూ.. చెరువు సమీపంలో హెచ్చెల్సీ గట్టు దిగి నీటిలోకి దూకింది. షఫీవుల్లా అనే యువకుడు నీటిలోకి దూకి ఆమెను కాపాడాడు. పోలీసులు వృద్ధురాలిని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి వివరాలు ఆరా తీసి కుటుంబసభ్యులకు అప్పగించారు. యువకుడిని స్థానికులు, పోలీసులు అభినందించారు.



వృద్ధురాలి వివరాలు తెసుకొంటున్న పోలీసులు, స్థానికులు

హుండీ ఆదాయం రూ.29.70లక్షలు

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని హుండీలను శుక్రవారం లెక్కించారు. వాటిద్వారా రూ.29.70లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈఓ రమేశ్‌బాబు తెలిపారు. లెక్కింపు ప్రక్రియను దేవాదాయ ఇన్‌స్పెక్టర్ వన్నూరుస్వామి పర్యవేక్షించారు. లెక్కింపులో హనుమాన్ సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

పశుగణన ప్రారంభం

ఉరవకొండ డివిజన్‌లో పశుగణన శుక్రవారం ప్రారంభం అయ్యింది. మొదటి రోజు కౌకుంట్లలో మంత్రి పయ్యావుల కేశవ్ ఇంటి వద్ద అధికారులు ఆ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విడపనకల్లులో సర్పంచి చంద్రశేఖర్ ఇంటి వద్ద నుంచి పశు గణనను చేపట్టినట్లు డీడీ డాక్టర్ వెంకటేశ్ చెప్పారు. గణన పూర్తయిన ఇళ్లకు స్టిక్కర్లు అతికించేలా ఏర్పాట్లు ఉన్నాయన్నారు. కుందుర్పి, రాయదుర్గం, వజ్రకరూరు, బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లోనూ పశుగణన చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు గోడపత్రాలను ఆవిష్కరించారు. **- న్యూస్‌టుడే బృందం**

ఉద్యాన పంటలకు అపార నష్టం



కుళ్లిపోయిన ద్రాక్ష గుత్తులు

కణేకల్లు, న్యూస్‌టుడే: రూ.లక్షలు పెట్టుబడి పెట్టి ఉద్యాన పంటలు సాగు చేసిన రైతుల ఆశలు అడియాసలు అయ్యాయి. తెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు కణేకల్లు మండలంలోని గోపులాపురం గ్రామానికి చెందిన రైతు సోదరులు ఆదినారాయణ, నవీన్, నరసింహులు సాగు చేసిన ద్రాక్ష, కళింగర, కర్బూజ దెబ్బతిని తీవ్ర నష్టం వాటిల్లింది. రైతు ఆదినారాయణకు చెందిన 9 ఎకరాల్లో ద్రాక్ష తీవ్రంగా దెబ్బతింది. కోయడానికి వీలు లేకుండా కాయలు కుళ్లిపోతున్నాయి. రూ.60లక్షలు నష్టపోయినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశారు. నవీన్‌కు చెందిన 7ఎకరాలలో కర్బూజ, నరసింహులుకు చెందిన 7ఎకరాల్లో కళింగర పంట పూర్తిగా కుళ్లిపోయాయి. రూ.40లక్షల వరకు నష్టపోయినట్లు వారు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు. ఉద్యాన అధికారిణి మౌనిక దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. నష్టం అంచనాను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.

దానిమ్మ పంటకు తెగుళ్లు

రాయదుర్గం గ్రామీణం: నియోజకవర్గంలో తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు దానిమ్మ, ద్రాక్ష, కర్బూజ, సపోటా, చీనీ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మండలంలోని వేపరాళ్ల గ్రామంలో రైతు వన్నూరప్ప ఐదు ఎకరాల్లో దానిమ్మ పంట సాగు చేశారు. దిగుబడి చేతికొచ్చే సమయంలో వర్షాలకు తెగుళ్లు సోకి పంట కుళ్లిపోయింది. దాదాపు రూ.10లక్షలు మేర నష్టం వాటిల్లినట్లు ఆయన వాపోయారు. వడ్రవన్నూరు, మల్లాపురం, 74ఉడేగోళం, బొమ్మక్కపల్లి, ఆవులదట్ల గ్రామాల్లో సపోటా, చీనీ, అరటి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.



తెగులు సోకిన దానిమ్మ కాయలను చూపుతున్న రైతు వన్నూరప్ప

తెదేపా సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి

రాయదుర్గం, న్యూస్‌టుడే: పట్టణంలో తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నాయకులకు, కార్యకర్తలు విజయవంతం చేయాలని పట్టణ తెదేపా అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు సూచించారు. శుక్రవారం ఉదయం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు రెండు నెలల పాటు ఉంటుందన్నారు. రాష్ట్రంలోనే అగ్రభాగాన ఉండేలా కృషి చేయాలన్నారు. కార్యకర్తలు సభ్యత్వం తీసుకుంటే రూ.5లక్షల వరకు ప్రమాద బీమా ఉంటుందన్నారు. సమావేశంలో పట్టణ తెదేపా కార్యదర్శి ఇనాయత్, నాయకులు కడ్డిపుడి మహబూబ్‌బాషా, తిప్పేస్వామి, పైతోట రామాంజనేయులు, బూదూరు తిప్పేస్వామి, వెంకటేశులు, రాజశేఖర్, కావలి రవి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ముసురుతున్నా.. తొలగని చెత్త

కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో చెత్తను సకాలంలో తొలగించడం లేదు. రోజూ సుమారు 21 టన్నుల చెత్త పోగవుతుంది. కుండీలు నిండి చెత్త ప్రధాన రోడ్ల మీదకు వస్తోంది. అధికారులు యంత్రాలు లేవనే నెపంతో మిన్నకుండిపోయారు. మున్సిపాలిటీకి ఒక కంప్యాక్టర్, రెండు ట్రాక్టర్లు ఉన్నాయి. ట్రాక్టర్లు అధ్వానంగా మారాయి. వాటిలో చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తే సగం రోడ్లమీదే పడిపోతుంది. కంప్యాక్టర్ మరమ్మతులకు గురైంది. జబ్బులు ముసురుతున్నా మున్సిపాలిటీ అధికారులు చెత్తను తొలగించడంలో చిత్తశుద్ధి చూపడం లేదని పట్టణ వాసులు వాపోతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ దృష్టికి తీసుకువెళ్లగా రెండు రోజుల్లో శుభ్రం చేయిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం**



దారి శిథిలం.. ఆదమరిస్తే ప్రమాదం



ఉరవకొండ శివారు హంద్రీనీవా ఉప కాలువ వద్ద గుంతకల్లు ప్రధాన రహదారి పూర్తిగా శిథిలం అయ్యింది. వంతెన నిర్మాణం పేరుతో గతంలో హంద్రీనీవా అధికారులు రోడ్డును తవ్వారు. ఆ తరువాత మట్టి చదును చేయించి, చేతులు దులుపుకొన్నారు. మట్టి దారి గుంతలు పడి అధ్వానంగా మారింది. భారీ వాహనాలు వెళ్లడం కష్టంగా ఉంది. దారికి ఇరువైపుల కాలువ ఉండటంతో వాహనదారులు ఆదమరిస్తే ప్రమాదాలకు గురి కావాల్సిందే. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈఈ కావ్య దృష్టికి తీసుకెళ్లగా పక్కాగా రహదారి నిర్మించేలా చర్యలు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, ఉరవకొండ**

మురుగు చేరి.. మడుగులా మారి

బొమ్మనహాళ్ మండలంలోని దర్గాహొన్నూరు పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో వర్షపునీరు వెళ్లడానికి డ్రైనేజీ లేదు. దాంతో నీరు నిల్వ చేరి మడుగును తలపిస్తోంది. అందులో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని గ్రామస్థులు తెలిపారు. అధికారులు తగు చర్యలు తీసుకుని అపరిశుభ్రతను తొలగించాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి కుళ్లాయినాయుడు దృష్టికి తీసుకువెళ్లగా డ్రైనేజీలు, సిమెంటు రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. **- న్యూస్‌టుడే, బొమ్మనహాళ్**



ముళ్లచెట్లలో మహిళా భవనం



కుందుర్పి మండలం బెస్తరపల్లిలోని గొల్లలదొడ్డి వీధిలో మహిళలు వినియోగించేందుకు వీలుగా దశాబ్దం కిందట ప్రభుత్వ నిధులతో భవనం నిర్మించారు. ప్రస్తుతం దాని చుట్టూ ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రత నెలకొంది. ఎలాంటి రక్షణ గోడ లేకపోవడంతో విషకీటకాలు సంచరిస్తున్నాయి. భవనంలోకి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి ముళ్లచెట్లు తొలగించి, రక్షణగోడ నిర్మించాలని మహిళలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కుందుర్పి

రుణం.. ఉపాధికి ఊతం

ఉరవకొండ, న్యూస్‌టుడే: మహిళా సంఘాల సభ్యులు పొదుపు పాటిస్తూనే బ్యాంకులు, స్త్రీనిధి, ఉన్నతి ద్వారా రుణాలు పొంది అభివృద్ధి పథాన నడుస్తున్నారు. చాలా మంది స్వయం ఉపాధి యూనిట్లను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఒకవైపు కుటుంబాలను పోషించుకుంటూనే.. మరోవైపు పిల్లలను ఉన్నతంగా చదివించుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

మండలం	మొత్తం సంఘాలు	సభ్యులు	పొందిన రుణం (రూ.కోట్లలో)
బెళుగుప్ప	785	7,850	14.08
వజ్రకరూరు	900	9,000	11.65
ఉరవకొండ	1,227	12,270	15.49
విడపనకల్లు	892	8,920	8.25
కూడేరు	710	7,100	10.28

4514 సంఘాలకు చేయూత

ఉరవకొండ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 4,514 మహిళా సంఘాలు ఉన్నాయి. వాటిలో 45,140 మంది సభ్యులుగా ఉన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సంఘాలకు రూ.206 కోట్లు రుణం అందించాలన్నది లక్ష్యం. ఇప్పటి వరకు 1,018 సంఘాలకు రూ.59.78కోట్లు మంజూరు చేశారు. మిగతా మొత్తాన్ని సంఘాలకు అందించే దిశగా వైకేపీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ రుణంతో అనేక మంది మహిళలు తాము ఉన్న చోటే స్వయం ఉపాధి యూనిట్లను ఏర్పాటు చేసుకుని, ఆదాయాన్ని పొందుతున్నారు. రుణాలను సక్రమంగా తిరిగి చెల్లిస్తూ, అభివృద్ధి బాటలో నడుస్తున్నారు.

కిరాణ దుకాణంతో కుటుంబ పోషణ

మా మహిళా సంఘం పేరు అల్కదీర్. అందులో సభ్యురాలిగాఉంటూ నాలుగేళ్లుగా రుణం తీసుకుంటున్నా. తాజాగా రూ.లక్ష తీసుకుని, కిరాణ దుకాణం పెట్టుకున్నా. తద్వారా ఆదాయం పొందుతూ, కుటుంబ పోషణకు తోడ్పడుతున్నా. పిల్లలను చక్కగా చదివించుకుంటున్నా. రుణాన్ని సక్రమంగా చెల్లిస్తూ, సంఘం అభివృద్ధికి మార్గాన్ని వేసుకుంటున్నాం. ప్రభుత్వం మహిళా సంఘాలకు తోడ్పాటు అందించడం సంతోషకరం.

- నాగమణి, ఉరవకొండ



సామాజిక తనిఖీలో రూ.1.50 కోట్ల అవినీతి బహిర్గతం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో జరిగిన ఉపాధిహామీ పథకం పనుల్లో అన్నీ తప్పేలేనని, లెక్కలు అడ్డగోలుగా ఉన్నాయని అధికారులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధిహామీ పథకం బహిరంగ వేదిక జరిగింది. డ్వామా అదనపు పీడీ సుధాకర్ రెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఏపీడీ రమేష్‌నాయక్, ఎంపీడీవో రామచంద్ర, ఎంపీపీ మారుతమ్మ, ఎస్సార్పీ మీరావలి హాజరయ్యారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.8.28 కోట్లతో 970 పనులు జరిగాయన్నారు. క్షేత్రస్థాయిలో పనులను పరిశీలిస్తే కొలతల్లో తేడాలు ఉన్నా, దస్త్రాల్లో సక్రమంగా ఎలా వచ్చాయంటూ నిలదీశారు. ఇష్టానుసారంగా దస్త్రాలు తయారు చేశారని, మిగిలిన మొత్తానికి సంబంధించిన వివరాలు ఎక్కడ అని ప్రశ్నించారు. సమాధానం చెప్పలేక ఉద్యోగులు, సిబ్బంది నీళ్లు నమిలారు. రూ.8,28,28,550 విలువైన పనులు జరుగగా రూ.1,50,69,108 అవినీతి జరిగిందని తేల్చారు.

● మానిరేవులో రైతు సురేష్ పొలంలో మొక్కలు నాటకుండానే రూ.3 లక్షలు డ్రా చేసినట్లు తేల్చారు. కొండాపురంలో రైతులకు సొమ్ము చెల్లించకుండా ఫీల్డ్ అసిస్టెంట్ వారి కుటుంబ సభ్యుల పేర్లపై మార్చుకొని స్వాహా చేసినట్లు బయటపడింది. సమావేశానికి గతంలో పని చేసిన క్షేత్రస్థాయి సహాయకులు, కొందరు సిబ్బంది గైర్హాజరు కావడం గమనార్హం.

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి



ప్రసంగిస్తున్న తెదేపా నాయకుడు నారాయణస్వామి

ఉద్యమంలా తెదేపా సభ్యత్వ నమోదు

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు నియోజకవర్గంలో తెదేపా సభ్యత్వ నమోదు ఉద్యమంలా సాగాలని తెదేపా నాయకుడు నారాయణస్వామి, పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణారెడ్డి అన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంపై చర్చించి నిర్ణయాలు తీసుకోవడానికి కసాపురం రోడ్డుపక్కన పార్టీ వార్డు ఇన్‌ఛార్జులు, కౌన్సిలర్ల సమావేశం శుక్రవారం జరిగింది. తెదేపా నాయకులు అంజి, మస్తాన్‌యాదవ్, మల్లికార్జున, మస్తానప్ప, గుణశేఖర్, లక్ష్మీనారాయణ, శివన్న, ప్రభాకర్ పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఆలయ అభివృద్ధి

తాడిపత్రి, న్యూస్‌టుడే : బుగ్గ రామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని అందరం కలిసి అభివృద్ధి చేసుకుందామని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక బుగ్గరామలింగేశ్వరునికి శుక్రవారం ఆయన కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ భక్తులు, కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఆలయాన్ని అభివృద్ధి కోసం చర్చించేందుకు పిలుపునిస్తే కొంతమంది రావడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

బయోగ్యాస్ ఉత్పత్తికి స్థల సేకరణ

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిలో తడి చెత్త నుంచి బయోగ్యాస్ ఉత్పత్తికోసం స్థలాన్ని సేకరిస్తున్నట్లు పురపాలక సంఘం కమిషనర్ జబ్బార్‌మియా తెలిపారు. ప్లాంట్ ఏర్పాటుకు 5 ఎకరాల స్థలం అవసరమన్నారు. స్థలాన్ని కేటాయించాలని రెవెన్యూ అధికారులను కోరినట్లు ఆయన పేర్కొన్నారు. స్థలసేకరణ పూర్తి కాగానే ప్లాంటు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

యల్లనూరు (పుట్లూరు), న్యూస్‌టుడే : యల్లనూరు మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగింది. జలజీవన్ మిషన్, గృహ నిర్మాణాలు, విద్యా, వైద్యం, తదితర శాఖల్లో జరుగుతున్న ప్రగతి పనులను ఆయా శాఖల అధికారులు వివరించారు. ఎంపీటీసీ సభ్యుడు తిమ్మారెడ్డి పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో వాసుదేవరెడ్డి, ఇన్‌ఛార్జి తహసీల్దారు శేషారెడ్డి, ఎంపీపీ గంగాదేవి, జడ్పీటీసీ సభ్యుడు బోగాతి ప్రతాపరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైల్వే గేట్‌ను ఢీకొన్న ఆటో

గార్లదిన్నె, న్యూస్‌టుడే : గార్లదిన్నె నుంచి పెనకచెర్ల డ్యామ్‌కు వెళ్లే రహదారిపై ఉన్న రైల్వే గేట్‌ను శుక్రవారం ఆటో ఢీకొనడంతో వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. గార్లదిన్నె నుంచి మర్తాడు వైపు ఆటో వెళ్తుండగా గేటు వేస్తున్న సమయంలో ఆటో అక్కడికి చేరుకోగానే దానిపై గేటు పడడంతో గేటు దెబ్బతింది. వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధికి సహకరించాలి

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : పీహెచ్‌సీ అభివృద్ధికి ప్రతి సభ్యుడు సహకరించాలని వైద్యుడు శ్రీనివాసబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆసుపత్రిలో అభివృద్ధి కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీపీ శ్రీదేవి, ఉప తహసీల్దారు వెంకటేశ్వరమ్మ, ఎంపీడీవో కార్యాలయ సీనియర్ సహాయకులు రామచంద్రారెడ్డి, సీహెచ్‌వో చిట్టితల్లి, ఆసుపత్రి యూడీసీ రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

గార్లదిన్నె, న్యూస్‌టుడే: గార్లదిన్నెలో ఎర్రిస్వామి అనే వ్యక్తికి చెందిన ద్విచక్రవాహనం చోరీకి గురైనట్లు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాలడెయిరీని నడుపుకొంటున్న ఎర్రిస్వామి గురువారం రాత్రి ఇంటి ముందు వాహనాన్ని ఉంచగా శుక్రవారం తెల్లవారుజామున కనిపించలేదన్నారు.

ఖోఖో పోటీలకు అనంత జట్లు

గుంతకల్లు: చిత్తూరు జిల్లా కాణిపాకంలో మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటున్న అనంతపురం జిల్లా బాలబాలిక జట్లు శుక్రవారం జరిగిన మార్చ్‌ఫాస్ట్ కార్యక్రమంలో పాల్గొన్నాయి. ఖోఖో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుల్లారెడ్డి, జట్ల మేనేజరు శర్మస్‌లో జట్ల వెంట వెళ్లారు. వివిధ జిల్లాల జట్లతో అనంత జిల్లా జట్లు తలపడనున్నాయని పుల్లారెడ్డి పేర్కొన్నారు.

పోలీసు వ్యవస్థపై అవగాహన

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దవడుగూరులోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పోలీసు వ్యవస్థపై అవగాహన కల్పించారు. స్టేషన్‌కు వచ్చిన విద్యార్థులకు ఎస్సై ఆంజనేయులు, ఏఎస్సై నారాయణనాయక్ తదితరులు పోలీసుల విధులు, తుపాకీ, కారాగారం తదితర అంశాలపై వివరించారు.

తండ్రి హత్య కేసులో నిందితుడి అరెస్టు

యాడికి, న్యూస్‌టుడే: తండ్రిని హత్య చేసిన కేసులో నిందితుడిని యాడికి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సీఐ ఈరన్న తెలిపిన వివరాల మేరకు యాడికి మండలం వీరన్నపల్లి గ్రామానికి చెందిన వర్రా లక్ష్మీనారాయణకు ఇద్దరు భార్యలున్నారు. కుటుంబ సభ్యుల నడుమ ఆస్తి పంపకాలకు సంబంధించి వివాదం నడుస్తోంది. పెద్ద భార్య కుమారుడు కార్తిక్ తమకు చెందాల్సిన ఆస్తిని పంచి ఇవ్వకుండా, వ్యసనాలకు ఖర్చు పెడుతుండటాన్ని జీర్ణించుకోలేక పోయాడు. దీంతో తండ్రిని హత్య చేశాడు. నిందితుడు కార్తిక్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

గ్రామం : రజాపురం | మొత్తం సంఘాలు 26 | సభ్యుల సంఖ్య : 290 | పొదుపు సొమ్ము : రూ.కోటి

పొదుపు మంత్రం.. ప్రగతి తంత్రం

- స్వయం ఉపాధి దిశగా మహిళలు
- చిరువ్యాపారాలతో ఆర్థిక సాంత్వన

గుత్తి, గుత్తిగ్రామీణం, న్యూస్‌టుడే : గుత్తి మండలంలోని రజాపురం గ్రామంలో మహిళా సంఘాలు ఆదర్శంగా నిలిచాయి. 1995 నాటి తొలిరోజుల్లో కేవలం మూడు సంఘాలు ఏర్పాటయ్యాయి. పొదుపు బాట పట్టి ఆర్థికాభివృద్ధిని సాధిస్తూ ముందుకు సాగుతున్నారు. సభ్యుల పొదుపు మొత్తం రూ.కోటి వరకు ఉంది. ఏటా రూ.రెండు కోట్ల మేర లావాదేవీలు సాగిస్తున్నారు. సంఘాల సభ్యులు ప్రగతిపథంలో పయణిస్తున్నారు. బ్యాంకుల్లో తీసుకునే రుణాలను కచ్చితంగా నెలనెలా చెల్లిస్తున్నారు.

రూ.13 లక్షలతో సమావేశ భవనం

సంఘాల సభ్యులు ప్రతి నెలా సమావేశాల నిర్వహణకు భవనం లేక అవస్థలు పడేవారు. రెండేళ్ల కిందట గ్రామంలో 5 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసి రూ.13 లక్షలతో సమావేశ మందిరాన్ని నిర్మించుకున్నారు. యానిమేటర్ ఓబుళనాయుడు సహకారంతో

ప్రభుత్వ ప్రోత్సాహంతో ముందుకు



గ్రామంలో డ్వాక్రా సంఘాల ఏర్పాటుతో మా తలరాతలు మారాయి. తొలిరోజుల్లో సంఘాలను పెద్దగా పట్టించుకునేవారం కాదు. రానురాను తామే సంఘాలుగా ఏర్పడ్డాం. అప్పుడు బ్యాంకులు, ప్రభుత్వ ప్రోత్సాహంతో ఉపాధి యూనిట్లను స్థాపించుకుని స్వయం సమృద్ధిని సాధిస్తూ వస్తున్నాం. సభ్యులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారు. రుణాలు పొందిన ప్రతి ఒక్కరూ ఏదో ఒక యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నారు.

\- త్రివేణి, మైత్రీ సంఘం, అధ్యక్షురాలు

ఇతర ప్రాంతాలకు ఆదర్శం

గ్రామంలో పొదుపు సంఘాల పనితీరును చూసేందుకు కర్నూలు, అనంతపురం, పుట్టపర్తి జిల్లాల నుంచి అనేక మంది వస్తుంటారు. ఇటీవల విజయవాడ నుంచి సెర్ప్ అధికారులు సందర్శించారు. ఏపీమాస్ వారు కూడా సంఘాల పనితీరును అధ్యాయనం చేశారు.



సమావేశమైన మహిళా సంఘం సభ్యులు

ఇంటి వద్దే సంపాదన

కొందరు సభ్యులు గొర్రెలు, మేకల, బర్రెల పెంపకాన్ని చేపట్టారు. మరికొందరు శుద్ధజల ప్లాంట్‌ను నిర్వహిస్తున్నారు. మరికొందరు కిరాణాదుకాణాలను నిర్వహిస్తూ ప్రతినెలా రూ.20వేల వరకు సంపాదిస్తున్నారు. తమ పిల్లలకు ఉన్నత చదువులు చెప్పిస్తున్నారు.

- సాయి పొదుపు సంఘంలో పదిమంది సభ్యులున్నారు. సభ్యులు చిరువ్యాపారాలతో ఆర్థిక ప్రగతి సాధించారు. సంఘంలో త్రివేణి అనే మహిళకు రూ.1.50 వేలు బ్యాంకు రుణం ఇచ్చింది. స్త్రీ నిధి కింద రూ.లక్ష, సీఐఎఫ్ కింద రూ.50 వేలు, సొంతంగా రూ.లక్ష స్వయం సిద్ధి కింద రూ.4లక్షలు పెట్టుబడితో కిరాణా దుకాణాన్ని ఏర్పాటు చేసుకుంది. ప్రతినెలా రూ.30వేలు గడిస్తోంది. పిల్లల్ని ఉన్నత చదువులు చదివిస్తోంది. ఇలా ఎన్నో విజయగాథలు రజాపురం గ్రామాన్ని ఉన్నతంగా నిలిపాయి.

సమస్య : నార్పలలో తహసీల్దారు, ఎంఈవో కార్యాలయాల వద్ద పైపులు పగిలి నీరు వృథాగా పోతోంది. - **రమేష్, నార్పల**

సమాధానం: సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. -శైలజారాణి, ఈవోఆర్డీ - **న్యూస్‌టుడే, నార్పల** - **న్యూస్‌టుడే, శింగనమల**

సమస్య : కల్లుమడి నుంచి తరిమెలకు వెళ్లే దారిలో రోడ్డుకు ఇరువైపులా వీధి దీపాలు లేవు. - **దినేష్, కల్లుమడి**

సమస్య : నాయనవారిపల్లి గ్రామంలో మురుగు కాలువలను శుభ్రం చేయడం లేదు. - **శ్రీనాథ్, నాయనవారిపల్లి**

సమాధానం : పై సమస్యలను పరిష్కరిస్తాం.

\- **నిర్మలాకుమారి, ఎమ్పీడీవో** - **న్యూస్‌టుడే, తాడిపత్రి**

సమస్య : తాడిపత్రిలోని జయనగర్, అంబేడ్కర్‌నగర్ కాలనీల్లో మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు బయటికి వస్తోంది. - **మహేంద్ర, స్థానికుడు**

సమాధానం : వెంటనే ఆయా కాలనీల్లో సమస్య లేకుండా చేస్తాం.

\- **తేజ, మున్సిపల్ ఏఈ**



వంతెనపై ప్రయాణం.. ప్రమాదకరం

యర్రగుంట్ల గ్రామం నుంచి ముకుందాపురం గ్రామానికి వెళ్లే దారిలో హెచ్చెల్సీ కాలువపై నిర్మించిన వంతెనకు ఉన్న రక్షణ గోడలు లేవు. ప్రమాదాలకు నిలయంగా మారడంతో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సి వస్తోంది. చాలా కాలమవుతున్నా పట్టించుకున్న వారే లేరు. అధికారులు స్పందించి రక్షణ గోడలు నిర్మించాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, గార్లదిన్నె గ్రామీణం**

పోటీలు.. విజ్ఞాన వీచికలు





'ఈనాడు' ఆధ్వర్యంలో తాడిపత్రిలోని టార్గెట్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. అందులో భాగంగా 'అంతర్జాలంతో కలిగే లాభనష్టాలు, సామాజిక మాధ్యమాలు- విద్యార్థులపై ప్రభావం' అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన రమ్యశ్రీ, వెంకటజ్ఞాపిక, వాజియాలకు పాఠశాల కరెస్పాండెంట్ జయచంద్ర బహుమతులు అందజేశారు.

\- **న్యూస్‌టుడే, తాడిపత్రి**

అడుగడుగునా గుంతలే



నిత్యం వాహన రాకపోకలతో రద్దీగా ఉండే రైల్వేకు చెందిన అరవిందనగర్‌లోని తారురోడ్డు అధ్వానంగా ఉంది. వివిధ కాలనీలకు చెందిన రైల్వే ఉద్యోగులు, పట్టణానికి చెందిన వారు, ఆర్సీఎం చర్చికి చెందిన ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ రోడ్డు గుండానే వెళతారు. ఇక్కడి గుంతలతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక్కడి పరిస్థితిపై సంబంధిత రైల్వే అధికారులు స్పందిస్తూ మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదించామని చెబుతున్నారు. - **న్యూస్‌టుడే, గుంతకల్లు**

అభివృద్ధి పనులపై పర్యవేక్షణ

పామిడి, న్యూస్‌టుడే : పామిడి మేజర్ గ్రామ పంచాయతీని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్తి, నీటి పన్నులు, పంచాయతీ పాలన విధివిధానాలపై ఈఓ గోపాల్‌కు దిశానిర్దేశం చేశారు. అనంతరం పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి, పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించారు. పామిడి మున్సిపాలిటీ ఉన్న హయాంలో దుకాణ సముదాయాన్ని అప్పటి మార్కెట్ స్థితిగతుల ఆధారంగా బాడుగలు వసూలు చేశారు. గ్రామ పంచాయతీగా మార్పు చేసినప్పటి నుంచి వేలంపాట జరగలేదు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు దుకాణ సముదాయం వేలం పాటను త్వరలో నిర్వహిస్తామని ఈఓ తెలిపారు.

ఆయాల నియామక ప్రక్రియ

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు పరిధిలోని ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం ఆర్డీఓ శ్రీనివాస్, ఐసీడీఎస్ గుత్తి అధికారి శ్రీదేవి ఆధ్వర్యంలో శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయాల పోస్టులను భర్తీ చేయడానికి ఎంపిక ప్రక్రియ జరిగింది. దీనికి సంబంధించి గుంతకల్లు, గుత్తి, ఉరవకొండ, తాడిపత్రి ప్రాంతాల్లోని ఖాళీలను భర్తీ చేయడానికి అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

అక్కరకురాని నీటి పథకం

ఉపరితల ట్యాంకుల నుంచి నీటిని పట్టణంలోని కుళాయిలకు సరఫరా చేయడానికి ఉద్దేశించిన విద్యుత్తు మోటార్ల నిర్వహణ అధ్వానంగా మారింది. మండీబజార్ ఉపరితల ట్యాంకుల వద్ద మూడు మోటార్లను ఏర్పాటు చేయగా అందులో ఒకటి పని చేయడంలేదు. ఫలితంగా నీటిని సరఫరా చేయడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యుత్తు లేని సమయంలో కుళాయిలకు నీటిని అందించడానికి ఆటంకం ఏర్పడుతోంది. దీనిపై మున్సిపల్ ఏఈ హరికృష్ణను వివరణ కోరగా జనరేటర్‌ను వెంటనే వినియోగంలోకి తెస్తామన్నారు. పని చేయని విద్యుత్తు మోటారును తొలగించి దానిస్థానంలో కొత్తగా కొన్న మోటారును మారుస్తామని వివరించారు. -**న్యూస్‌టుడే, గుంతకల్లు**



పశుగణన పక్కాగా ఉండాలి

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలోని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి అధికారులతో కలిసి అఖిల భారత పశుగణనను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు జరిగే పశుగణనలో కచ్చితమైన లెక్కలు తేల్చాలన్నారు. ఆయా మండలాలకు పశుగణన నిమిత్తం యానిమేటర్లను నియమించారని ఆయన తెలిపారు. పశుసంవర్ధకశాఖ ఏడీ ఖదీర్ బాషా పలువురు పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశుగణనతో పాడిపోషకులకు ప్రయోజనం చేకూరుతుందని పశుసంవర్ధక శాఖ ఏడీఏ రత్నకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన ఎంపీపీ సునీతతో కలిసి బుక్కరాయసముద్రంలో పశుగణన కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. పశువైద్యులు గోవిందరాజులు, సిబ్బంది తేజస్విని, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

గార్లదిన్నె: అఖిల భారత పశుగణనలో భాగంగా శుక్రవారం గార్లదిన్నె పశువైద్య కేంద్రంలో గోడపత్రాలను అధికారులు ఆవిష్కరించారు. పశువైద్య సిబ్బందికి పశుగణన సామగ్రిని అందజేశారు. పశువైద్యాధికారి రమేష్, ఎంపీడీవో యోగానంద రెడ్డి, పాల్గొన్నారు.

ఏటీఎం చోరీ విఫలయత్నం కేసు.. దొంగలు అరెస్టు

నార్పల, న్యూస్‌టుడే : నార్పలలో ఏటీఎం చోరీకి యత్నించిన దుండగులను నార్పల పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అనంతపురం గ్రామీణ డీఎస్పీ వెంకటేశులు తెలిపిన వివరాల మేరకు 10 రోజుల కిందట నార్పలలో ఎస్‌బీఐ ఏటీఎంను ధ్వంసం చేసిన దుండగులు ఎత్తుకెళ్లడానికి యత్నించారు. సాధ్యం కాకపోవడంతో అక్కడే వదిలేసి పారిపోయారు. ఈ కేసును సవాలుగా తీసుకున్న సీఐ కౌలుట్లయ్య, ఎస్సై సాగర్ సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారన్నారు. శుక్రవారం ఐదుగురు నిందితులను నార్పల శివారులో అరెస్టు చేశామన్నారు. తాగుడుకు బానిసైన నిందితులు జల్సాలు చేయడానికి అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశులు తదితరులు

వర్షం నీటిని ఒడిసి పడదాం

గార్లదిన్నె, న్యూస్‌టుడే : ప్రభుత్వ కార్యాలయాల్లో కురిసిన వర్షంనీరు వృథా కాకుండా భూమిలో ఇంకిపోవడానికి ఇంకుడు గుంతల నిర్మాణానికి ఎంపీడీవో యోగానందరెడ్డి శుక్రవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో, తహసీల్దారు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, పరిసరప్రాంతాల్లో నీరు నిల్వ ఉండేందుకు ఒక్కొక్క గుంత నిర్మాణానికి రూ.75వేలు ఉపాధి నిధులు మంజూరు అయినట్లు ఎంపీడీవో తెలిపారు.



ఇంకుడు గుంతనిర్మాణానికి భూమి పూజ చేస్తున్న అధికారులు



ప్రతిభా పోటీలకు విశేష స్పందన

'ఈనాడు' ఆధ్వర్యంలో పాతగుంతకల్లులోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. ఇందులో భాగంగా 'అంతర్జాలంతో కలిగే లాభనష్టాలు, సామాజిక మాధ్యమాలు - విద్యార్థులపై ప్రభావం' అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన ఫరీదాబాను, స్వాతి, యశ్వంత్‌లకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిర్మల్ కుమార్ బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు రామమోహన్, ఇమ్మాన్యుయేల్, మల్లికార్జున, రమేశ్, ఉమామహేశ్వర్‌రావ్ పాల్గొన్నారు.

-**న్యూస్‌టుడే, గుంతకల్లు, గుంతకల్లు గ్రామీణం**



ఐక్యరాజ్య సమితితో ప్రపంచ శాంతి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పాటైన ఐక్యరాజ్య సమితి ఏర్పాటుతో ప్రపంచ శాంతి సాధ్యమైందని సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్యులు రామ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఐక్యరాజ్యసమితి దినోత్సవం సందర్భంగా వర్సిటీలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి చరిత్ర, లక్ష్యాలు, ఉద్దేశాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆచార్య శీలారెడ్డి, బాబుజీ, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఐక్యరాజ్యసమితి దినోత్సవంలో ఆచార్యులు, విద్యార్థులు

పల్లె ముంగిట.. సమస్యల మోత



బోడాయిపల్లిలో రహదారిపై మురుగు

తాడిపత్రి, తాడిపత్రి పట్టణం, న్యూస్‌టుడే : పల్లెల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ప్రధానంగా ఎక్కడి చెత్త అక్కడ, మట్టిదారులు, మురుగు కాలువలు లేకపోవడంతో గ్రామీణులు అష్టకష్టాలు పడుతున్నారు. గత ఐదేళ్లల్లో పల్లెల ప్రగతిని వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఇలాంటి పరిస్థితి దాపురించింది.

- తాడిపత్రి మండలంలో 26 పంచాయతీలు ఉండగా 52 గ్రామాలున్నాయి. వీటిల్లో సుమారు 60 వేల మంది జనాభా ఉంది. వైకాపా అధికారంలో ఉన్న సమయంలో ప్రగతి పనులు జరగలేదు. కొన్ని పల్లెల్లో కనీసం తాగునీటి సౌకర్యార్థం పైపులు ఏర్పాటు చేయకపోవడంతో ఆ గ్రామాలన్నీ తాగునీటి సమస్యతో అల్లాడుతున్నాయి.

ఉన్నతాధికారులతో చర్చించాం

పల్లెల్లో పర్యటించి ప్రధాన సమస్యలను గుర్తిస్తాం. ప్రధానంగా సీసీదారులు, కాలువలు నిర్మించేందుకు ఉన్నతాధికారులతో చర్చించాం. త్వరలోనే వాటిని నిర్మించేందుకు చూస్తాం. పారిశుధ్య సిబ్బందితో ట్యాంకులు, మురుగును శుభ్రం చేయించి ప్రజలకు ఎలాంటి సమస్య లేకుండా చూస్తాం.

\- **వెంకటేష్, ఈవోఆర్డీ, తాడిపత్రి**

ఏ గ్రామానికెళ్లినా అంతే

- బోడాయిపల్లి, యర్రగుంటపల్లి, గంగాదేవిపల్లి గ్రామాల్లో ప్రధాన రహదారులపై వర్షం నీరు నిలబడింది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారింది. రహదారులు సరిగా లేకపోవడంతో పరిస్థితి దారుణంగా తయారైంది.
- వెలమకూరు, కావేటిసముద్రం, గన్నెవారిపల్లి, దిగువపల్లి గ్రామాల్లో సీసీదారులు, కాలువలు లేకపోవడంతో ఇళ్లమధ్యకు భారీగా మురుగు చేరుతోంది. నెలలు తరబడి పరిస్థితి ఇలాగే ఉంటోంది. ఫలితంగా దోమల బెడద ఎక్కువగా ఉంటోంది.
- బోడాయిపల్లి, కోమలి, యర్రగుంటపల్లి తదితర గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు సరిగా శుభ్రం చేయకపోవడంతో కలుషిత నీరు వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. ఆయా గ్రామాల్లో వీధి ట్యాంకులకు కుళాయిలు లేకపోవడంతో నీరు భారీగా వృథా అవుతోంది.

ఎత్తుకు పైఎత్తు.. ప్రత్యర్థి చిత్తు

- చదరంగంలో రాణిస్తున్న విద్యార్థులు



చదరంగం ఆటపై సాధన చేస్తున్న సాయి ప్రణీష్, సాయి శౌరిష్

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లుకు చెందిన విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో సత్తాచాటుతున్నారు. పట్టణంలోని మండి బజారుకు చెందిన వంకదారు వీరేంద్రనాథ్ గుప్త, సౌమ్య దంపతులకు సాయి ప్రణీష్, సాయి శౌరీష్ సంతానం. ఇద్దరూ ఒకే పాఠశాలలో చదువుతున్నారు. చిన్నప్పటి నుంచి చదరంగంలో ప్రతిభా కనబరుస్తున్నారు. దీని వెనక తండ్రి ప్రోత్సాహం ఎంతో ఉంది. మరోక బాలిక మదీహ 4వ తరగతి చదువుతోంది. చదరంగం అంటే ఇష్టం. చిన్న వయస్సులోనే అద్భుతంగా రాణిస్తోంది. తల్లిదండ్రులు మహమ్మద్ రఫీ, జాస్మి తమ కుమార్తెను చదవిస్తూ ఆటలో ప్రోత్సహిస్తున్నారు.



విద్యార్థిని మదీహ

బాలిక సత్తా : ● 2024 మార్చి 3న గుంతకల్లు మాంటిస్సోరి స్కూల్‌లో చెస్ పోటీల్లో అండర్-9 విభాగంలో బాలిక 6 రౌండ్లకు గాను 3పాయింట్లు సాధించి రెండో స్థానం సాధించింది.

● 2023 ఫిబ్రవరి 24న అనంతపురంలో జిల్లా స్థాయి చెస్ టోర్నీలో మదీహ పది రౌండ్లు గాను నాలుగు రౌండ్లలో సత్తా చాటింది.

సాధించిన విజయాలు

● 2022-23 నవంబరులో కర్నూలు జిల్లాలో స్పార్క్ చెస్ టోర్నీ జరిగింది. ఇద్దరూ పోటీల్లో పాల్గొని నాలుగు రౌండ్లలో సాయి ప్రణీష్ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచాడు. శౌరిష్ నాల్గో స్థానంలో సత్తా చాటాడు. ● 2023 ఫిబ్రవరి 22న కర్నూలులో రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. ఇక్కడ సాయి శౌరిష్ 9 రౌండ్లగాను 7 పాయింట్లు సాధించాడు. ● 2024 అక్టోబరు 2న కర్ణాటక రాష్ట్రంలో హుబ్బళ్లీలో జాతీయ స్థాయి ఓపెన్ చెస్ టోర్నీ జరిగింది. ఇక్కడా ప్రతిభ కనబరిచారు. ● 2024 అక్టోబరు 17న కర్నూలులో క్రీడా స్కూల్‌లో రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి. అండర్-15 విభాగంలో శౌరిష్ 7 రౌండ్లు గాను 5రౌండ్లలో సత్తా చాటాడు. ప్రణీష్ 4వ స్థానంలో నిలిచాడు.

వీఆర్‌ఏపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

శింగనమల, న్యూస్‌టుడే: శివపురం గ్రామంలో వీఆర్‌ఏ ఓబుళపతి ప్రజల ఇంటి నివాస స్థలాలను కాజేశారని బాధితులు ఆరోపించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్‌ఏ తీరుపై తహసీల్దార్ బ్రహ్మయ్యకు ఫిర్యాదు చేశారు. 531 సర్వే నంబరులోని నివాస స్థలాలను వీఆర్‌ఏ తన భార్య పేరు మీద పట్టాలు పొందినట్లు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై తహసీల్దార్ బ్రహ్మయ్య పరిశీలన చేసి వీఆర్‌ఏపై చర్యలు తీసుకుంటామన్నారు.

అనంతపురం

• అనంతపురం • రాప్తాడు

నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలి

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఉద్యోగాల భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సమ్మద్ రమణయ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్కేయూ ముఖద్వారం వద్ద నిరసన తెలిపారు. ఉద్యోగాలు కల్పించడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందుతున్నాయన్నారు. జూనియర్ న్యాయవాది రుక్సానా అనంత నగరంలో ఆత్మహత్య చేసుకొంది. ఎంతోమంది నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు మైనుద్దీన్, ఎస్ఎఫ్ఐ శివారెడ్డి, వంశీ, సుబ్బరాయుడు, శాంతిరాజు, సాయిమహేష్ పాల్గొన్నారు.

నైపుణ్యంతో ఉద్యోగ అవకాశాలు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకుంటే ఉద్యోగావకాశాలు లభిస్తాయని మాస్టర్ మైండ్స్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ బసవయ్య పేర్కొన్నారు. రాష్ట్ర నైపుణ్య శిక్షణ సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో శుక్రవారం మాస్టర్‌మైండ్స్ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ప్రతాప్‌రెడ్డి, సీడాప్ మేనేజరు సూర్యనారాయణలు మాట్లాడుతూ.. ప్రభుత్వ డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించడానికి కృషి చేస్తోందన్నారు. 349 మంది పేర్లు నమోదు చేసుకోగా 195 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఉపాధి కల్పన అధికారి కల్యాణి, ప్రిన్సిపల్ సతీష్‌నాయక్, ప్రాంగణ నియామకాల అధికారులు మహేష్, నారాయణస్వామి పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: అనంతపురంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని పీఎంటీ ట్రైనింగ్ స్కూల్‌లో ఏఎన్ఎం కోర్సులో చేరేందుకు ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఈ.బి.దేవి తెలిపారు. 40 సీట్లు ఉన్నాయని, ఈ కోర్సులో చేరే మహిళలకు వయసుతో నిమిత్తం లేదన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్హత ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఎల్పీజీ అక్రమ వాడకంపై తనిఖీలు

అనంత నేరవార్తలు: అనంతపురం ప్రాంతీయ నిఘా, అమలు అధికారులు శుక్రవారం నగరంలో ఎల్పీజీ అక్రమంగా వినియోగిస్తున్న హోటళ్లపై ఆకస్మిక దాడులు చేశారు. నగరంలోని జేఎన్‌నగర్‌లోని పవర్ ఆఫీసు ఎదురుగా ఫాస్ట్ ఫుడ్ హోటల్‌లో ఇంటికి వినియోగించాల్సిన గ్యాస్ సిలిండర్లను అక్రమంగా ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. మూడు సిలిండర్లను జప్తు చేసి, సదరు హోటల్ యజమానిపై కేసు నమోదు చేశారు. ఎస్సై పణీంద్రనాథ్‌రెడ్డి, ఏవో వాసుప్రకాశ్, డీసీటీఓ సురేశ్‌కుమార్, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యతని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య పేర్కొన్నారు. మండలంలోని అన్ని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ బాల్యవివాహాలు చేసేలా తల్లిదండ్రులు ఆలోచిస్తున్నారన్నారు. చిన్న వయసులో పెళ్లిళ్లు చేస్తే మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురవుతారని చెప్పారు. బాల్యవివాహాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే చైల్డ్‌హెల్ప్‌లైన్, అంగన్‌వాడీ, పోలీసులకు తెలియజేయాలన్నారు.

ఎమ్మెల్యే సునీతను కలిసిన అధికారులు

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా విజిలెన్స్ ఎస్పీ ప్రసాద్, సీఐ శ్రీనివాసులు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో పారదర్శకంగా తనిఖీలు నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతపురం హంద్రీనీవా డివిజన్ ఈఈ శ్రీనివాసులు, అనంతపురం విద్యుత్తు శాఖ ఏఈ సోమశేఖర్ ఎమ్మెల్యే సునీతను కలిశారు.



కట్టు కట్టించుకుంటున్న బాధితులు

నాణ్యమైన వైద్యం ఇంకెన్నాళ్లకు?

• తగ్గిన వైద్యుల సంఖ్య • అందుబాటులో లేని మందులు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత ప్రజలు ఎలాంటి జబ్బు వచ్చినా వెంటనే ప్రభుత్వాసుపత్రుల వైపు చూస్తారు. గత తెదేపా పాలనలో ఆసుపత్రి నిర్వహణ, మందుల కొనుగోలు కోసం ఆసుపత్రి అభివృద్ధి నిధులు (హెచ్‌డీఎస్) విడుదల చేసి కావాల్సిన వసతులు కల్పించేది. వైకాపా అధికారంలోకి వచ్చిన తరువాత వైద్య రంగంలో మార్పులు చేసి సామాన్య ప్రజలకు వైద్యం అందని ద్రాక్షలా చేసింది. వైద్యులను నియమించడం వదిలేసి ఉన్న వైద్యుల సంఖ్యను తగ్గించింది. తక్కువ ఉన్న చోటకు సర్దుబాటు చేశారు. గత తెదేపా పాలనలో ఆత్మకూరు ఆసుపత్రిలో ఐదుగురు వైద్యులు ఉండేవారు. నేడు ఇద్దరు ఉన్నారు. ఆర్‌హెచ్‌సీ, పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులుండేలా ఉత్తర్వులను నాటి వైకాపా ప్రభుత్వం విడుదల చేసింది. వైద్యుల సంఖ్య తగ్గడంతో సమస్యలు మరింతగా పెరిగాయి.

సమస్యలు కోకొల్లలు: కొద్దిరోజుల కిందట ఆత్మకూరు ప్రభుత్వాసుపత్రికి కట్టు కట్టించుకునేందుకు రోగులు రాగా తమ వద్ద బ్యాండేజీ, దూది లేదని బయట తెచ్చుకుంటే కడతామంటూ సిబ్బంది సమాధానం చెప్పారు. చేసేది లేక బయట నుంచి బ్యాండేజీ తెచ్చుకున్నారు.

● ఆసుపత్రిలో ఇద్దరు వైద్యులు ఉండగా ఒకరు గ్రామాల్లో పర్యటిస్తే ఒకరు మాత్రమే వైద్యం అందిస్తున్నారు. రోజుకి 90 నుంచి 150 వరకూ ఓపీ ఉండటంతో నాణ్యమైన వైద్య సేవలు అందడం లేదు.

● మెడికల్ వేస్ట్ వేయడానికి ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. అయితే ఆసుపత్రి వెనుక వేస్తున్నారు. ఆవరణ పిచ్చిమొక్కలతో నిండిపోయి విషపురుగులకు ఆవాసంగా మారింది.

● వందల సంఖ్యలో గర్భిణులు ఉన్నప్పటికీ నెలకు కనీసం 10 ప్రసవాలు కూడా జరగడం లేదు.

● రోగుల కోసం 2022లో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు సామగ్రిని తీసుకొచ్చారు. ఉపయోగించక పోవడంతో రూ.లక్షల సామగ్రి తుప్పు పట్టిపోతోంది.

● ఆసుపత్రిలో రోగుల కోసం ఏర్పాటు చేసిన తాగునీటి ప్లాంటను నిర్వహించడం లేదు. ఫలితంగా రోగులకు తాగునీరు కూడా లేని దుస్థితి నెలకొంది.



తుప్పుపడుతున్న ఆక్సిజన్ ప్లాంట్ సామగ్రి

మెరుగైన సేవలందిస్తాం

గతంలో కంటే నేడు ఆసుపత్రికి వచ్చే వారి సంఖ్య పెరిగింది. మండల ప్రజలకు అనుగుణంగా మందులు తీసుకొచ్చినా సరిపోవడం లేదు. ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. మెడికల్ వేస్ట్‌ని విధిగా కేటాయించిన గదుల్లో వేసేలా చర్యలు తీసుకుంటాం. మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తాం.

- సబిహా సుల్తానా, వైద్యాధికారి, ఆత్మకూరు




పండమేరులో తొలగించిన కంపచెట్లు

ప్రవాహానికి తొలగిన అడ్డు

మూడ్రోజుల కిందట పండమేరు వంకకు వచ్చిన వరదనీటికి సమీప కాలనీలు జలదిగ్బంధమయ్యాయి. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ వరదలకు ఆక్రమణలు ఒక కారణమైతే, వంక మొత్తం విపరీతంగా ముళ్ల పొదలు పెరిగి ప్రవాహానికి అడ్డు పడటం మరో కారణం. దీంతో జిల్లా యంత్రాంగం స్పందించి.. శుక్రవారం ఆర్డీటీ క్రీడామైదానం, ఉప్పరపల్లి పరిధిలో పండమేరులో ఉన్న కంపచెట్లను తొలగించి ప్రవాహానికి ఉన్న అడ్డంకులను తొలగించారు. **- ఈనాడు, అనంతపురం**



గోతులను చదును చేస్తున్న పొక్లెయిన్





వ్యాసరచనతో విజ్ఞానం, సృజన వికాసం

ఎస్కేయూ, న్యూస్‌టుడే: వ్యాసరచన పోటీలు విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని లక్ష్మీ సినర్జీ పాఠశాల కరస్పాండెంట్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని గుత్తిరోడ్డులోని పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పదో తరగతి విద్యార్థిని బ్రాహ్మణి ప్రథమ, 8వ తరగతి విద్యార్థిని సదియా అంజుం ద్వితీయ, 9వ తరగతి విద్యార్థిని రిషిత తృతీయ స్థానాల్లో నిలిచారు. కరస్పాండెంట్ మధుసూదన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు హెపిస్బా బహుమతులు అందజేశారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థి ప్రతిభ

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. రుద్రంపేటలోని జిల్లా పరిషత్తు పాఠశాలకు చెందిన విద్యార్థి నివేద్‌కుమార్ అండర్- 17, 35 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు సుమంగళి తెలిపారు.



నివేద్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు తదితరులు

కర్ణాటక మద్యం పట్టివేత

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఆధ్వర్యంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం శుక్రవారం జిల్లాలో పలు చోట్ల జరిపిన తనిఖీల్లో కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నారు. కూడేరు మండలం రామచంద్రాపురం మలుపు వద్ద ఇన్‌స్పెక్టర్ సునంద బృందం 29 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేశారు. కణేకల్లు స్టేషన్ పరిధి గోవిందవాడ నుంచి దర్గాహొన్నూరుకు వెళ్లే రహదారిలో 96 టెట్రా ప్యాకెట్లను, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఎస్కేయూ: విద్యార్థులు చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని విశ్రాంత అదనపు ఎస్పీ మల్లికార్జునవర్మ పేర్కొన్నారు. స్థానిక కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాజనీతిశాస్త్రం విభాగం, పోలీసు శిక్షణ కళాశాల సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

నెట్‌బాల్, బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్ జట్ల ఎంపిక

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-14, 17 విభాగాల్లో వివిధ క్రీడాంశాల్లో జరిగిన ఎంపిక పోటీలు పూర్తయ్యాయి. నెట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్ జట్లను ఎంపిక చేశారు. వివిధ మైదానాల్లో ఎంపిక పోటీలు నిర్వహించి అందులో ప్రతిభ పాటవాలు చూపిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరగనున్న పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొన్నారు. అంశాల వారీగా ఎంపికైన క్రీడాకారుల వివరాలను పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి సుగుణమ్మ ప్రకటించారు.

అంశాల వారీగా ఎంపిక ఇలా

నెట్‌బాల్ అండర్-14: బాలుర విభాగంలో ఎం.ఆంజనేయులు, జి.రమేష్, కె.నాని, కె.కార్తిక్, పి.నవాజ్, హెచ్.కృష్ణ, బి.అజయ్, ఎం.ధరణి, బి.సాయిమాధవ్, ప్రమోదానంద, డేవిడ్, ఎస్.మహమ్మద్, బాలికల విభాగంలో సి.వైష్ణవి, రషీదా, పూజ, ప్రవల్లిక, సుకన్య, జి.అమృత, బి.రక్షా, కె.నవ్య, టి.రేవతి, మనూష, జి.భావన్

అండర్-17: బాలుర విభాగంలో సందీప్ రావు, నరేంద్ర, హేమంత్‌కుమార్, శశాంక్, ప్రవీణ్, బాబామహబూబ్, ప్రసాద్, కె.మునీంద్ర, వినయ్‌కుమార్, రామ్‌చరణ్, కె.సాయికుమార్, యశ్వంత్, బాలికల విభాగంలో పి.నాగనందిని, వి.దీపిక, గీతారెడ్డి, సి.రేణుక, హన్సిక, మహలక్ష్మి, ఎం.అమల, సృజన, అలియా, బి.సుస్మిత, ఎం.సంయుక్త

జిమ్నాస్టిక్స్ అండర్-14: బాలుర విభాగంలో జి.భూతేష్, బి.శ్రీమన్నారాయణ, కె.ప్రభాస్, కె.వంశీ, ఎస్.వంశీ, కె.విష్ణు, కె.ప్రేమేంద్రరెడ్డి, బాలికల విభాగంలో జ్యోత్స్న, వై.నందిని, భానుశ్రీ, బి.అక్షిత, పి.సింధు, బి.శ్రావ్య, కె.మౌనిక

అండర్-17: బాలుర విభాగంలో జి.ధనుంజయ, వి.శ్రీహరి, ఎం.దిలీప్‌కుమార్, ఆర్.గౌతం, ఎం.అఖిల్, జి.సాయికిరణ్, ఎం.చరణ్‌లు, బాలికల విభాగంలో టి.ఆర్థిక, వి.సుమ కామిని, కె.అనుష్క, బి.సుమత్రి, హరిణి, పూజిత

షటిల్ బ్యాడ్మింటన్ అండర్-17: బాలుర విభాగంలో బి.రామ్‌ప్రతీక్, మురళీవెంకట్, వై.జగన్, ఆర్.కౌశల్‌కుమార్, సాయిస్కందన్, బాలికల విభాగంలో జె.నక్షత్ర, పి.విష్ణుసహస్ర, ఇందు ప్రియదర్శిని, వి.హిమబిందు, విజయలక్ష్మి

తెదేపాలో చేరిన కార్పొరేటర్

రాంనగర్ (అనంతపురం): అనంత నగరం 44వ డివిజన్ కార్పొరేటర్ శాంతిసుధ తెదేపాలో చేరారు. ఆమెతో పాటు 150 మంది పార్టీలో చేరారు. శుక్రవారం శ్రీనగర్‌కాలనీలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ వారికి తెదేపా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్పొరేటర్ శాంతిసుధ మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా తెదేపాలోనే ఉన్నామని, గతంలో అనుకోని కారణాలతో బయటకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. అయినప్పటికీ ఏ పార్టీలో చేరలేదన్నారు. స్వతంత్ర అభ్యర్థిగానే గెలిచామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ చేస్తున్న అభివృద్ధిని చూసి మళ్లీ పార్టీలోకి చేరామన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

అనంతపురం(వైద్యం): ఒక్కో వైద్యవిద్యార్థి చదువుకునేందుకు ప్రభుత్వం సగటున కోర్సులను బట్టి ఒక్కో సీటుకు రూ.కోటి నుంచి 3 కోట్లు ఖర్చు చేస్తోందని ఈ విషయాన్ని విద్యార్థులు గుర్తించుకుని వైద్య కోర్సు పూర్తైన తరువాత పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషిచేయాలని అనంతపురం పార్లమెంట్ ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం నియోజకవర్గం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్ తెలిపారు. శుక్రవారం అనంతపురంలోని వైద్యకళాశాలలో పీజీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు స్వాగతం పలికారు. ఎంపీ, ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. పీజీ పూర్తైన తరువాత గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఆసుపత్రుల్లో పనిచేయాలని కోరారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

కల్తీలేని ఆహారంతో ఆరోగ్యం

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే కల్తీలేని ఆహారం తీసుకోడానికి కృషి చేయాలని ఎస్కేయూ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు పేర్కొన్నారు. ఎస్ఎస్‌బీఎన్ ఎయిడెడ్ కళాశాలలో సంపూర్ణ పోషణ స్వస్థ జీవనం అనే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఫుడ్ సైన్స్ టెక్నాలజీ మైక్రోబయాలజీ, న్యూట్రీషియన్, డైటెటిక్స్ విభాగాలు సంయుక్తంగా నిర్వహించాయి. ఎస్ఎస్‌బీఎన్, ఎస్వీ, పీవీకేకే డిగ్రీ కళాశాలల విద్యార్థులు వివిధ రకాల వంటకాలను ప్రదర్శించారు. బజారుల్లో దొరికే ఆహారంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ఆహార పదార్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఫుడ్ టెక్నాలజీ విద్యార్థులు కృషి చేయాలన్నారు.

27 వరకు డీఎస్సీ ఉచిత శిక్షణకు గడువు

అశోక్‌నగర్: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 27 వరకు గడువు పొడిగించినట్లు సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఖుష్బు కొఠారి తెలిపారు. అర్హులైన అభ్యర్థులు జ్ఞానభూమి పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఖాళీ గృహాలు.. సమస్యల లోగిళ్లు



ముళ్ల పొదళ్లు.. చెత్తతో నిండి

నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో పదుల సంఖ్యలో నివాస గృహాలు నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో ఇళ్లకు ముళ్లపొదలు అల్లుకుని చెత్తతో నిండిపోయి విషపురుగులకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఓ వైపు ప్రహరీ పడిపోవడంతో చెత్త అందులో పడేస్తున్నారు. ముందు భాగంలో గేటు ఉన్నా చెత్త బయటకు వస్తోంది. ఈ సమస్యలతో పక్కనున్న నివాసాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

హౌసింగ్‌బోర్డు కాలనీ, అశోక్‌నగర్, న్యూస్‌టుడే: ఖాళీ నివాసాలే సమస్యలకు అడ్డాగా మారాయి. నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీ ఎంతో సువిశాలంగా ఉంటుంది. ఖాళీగా ఉన్న ఇళ్లతోనే ప్రజలకు సమస్యగా మారింది. పలు ప్రాంతాల్లో ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్నాయి. ఆయా ఇళ్లు ఉన్న వారు ఎక్కడో విదేశాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. నగరపాలక అధికారులు ఇళ్ల యజమానులకు తాఖీదులు ఇవ్వకుండా జాప్యం చేస్తుండటంతో ఇబ్బందికరంగా మారిందని కాలనీవాసులు వాపోతున్నారు.

ఆగిన నిర్మాణం.. చేరిన మురుగు



హౌసింగ్ బోర్డు ప్రధాన రోడ్డు నుంచి రాజీవ్ చిన్న పిల్లల ఉద్యానవనానికి వెళ్లే మార్గంలో పెద్ద భవనం నిర్మాణం చేపట్టారు. సెల్లార్ పైభాగం వరకు నిర్మాణం చేపట్టి వదిలేశారు. సెల్లార్ ఉండటంతో పక్కనే మురుగు కాలువ వెళుతోంది. వర్షం వస్తే సెల్లార్‌లో మురుగునీరు నిల్వ ఉంటోంది. నెలల తరబడి అలాగే ఉండటంతో దుర్వాసన వస్తోంది. పారిశుద్ధ్య సిబ్బంది పట్టించుకోకపోవడంతో దోమలు విపరీతంగా పెరిగి పోతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు.

అనంతలో పరిశ్రమల ఏర్పాటుకు వినతి

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: అనంత జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి టీజీ భరత్‌ను కోరారు. శుక్రవారం కర్నూలులో అనంతపురం నియోజకవర్గ పరిశీలకుడు లక్ష్మీనారాయణతో కలిసి మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రామీణ ప్రజలు ఉపాధి కోసం వలసలు వెళ్తున్నారన్నారు. అనంతపురం సమీపంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే వేలాది మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేసి చిన్న, సూక్ష్మ పరిశ్రమల స్థాపనకు తగిన ప్రోత్సాహకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్, జేసీతో చర్చించి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.



మంత్రి భరత్‌కు ప్రతిమ అందిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

పేదరిక నిర్మూలనే ధ్యేయం

అనంత నగరపాలక: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ద్వారా మహిళలకు స్వయం ఉపాధి కల్పించి పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పలు శిక్షణలు ఇవ్వనున్నట్లు అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌లు పేర్కొన్నారు. శుక్రవారం నగరపాలక వద్ద మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్‌ను ప్రారంభించారు. మహిళలు తయారు చేసిన వస్తువులు, వంటకాలు, వస్తువులను పరిశీలించారు. నగరంలో మహిళా మార్టులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

నోటీసులు ఇవ్వండి

అశోక్‌నగర్: నగరంలోని పలు వంకలను ఆక్రమించుకున్న వారికి నోటీసులు ఇవ్వాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ నగరపాలక అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. శుక్రవారం నగరపాలక కమిషనర్ నాగరాజుతో కలిసి అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరంలో వర్షాలు వస్తే నీరు ఆక్రమణల వల్ల నివాసాల్లోకి వెళ్లే ప్రమాదం ఉండటంతో వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లు గుంతలు పడ్డాయని, ఎప్పటిలోగా మరమ్మతులు పూర్తి చేస్తారో స్పష్టత ఉండాలన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

రాప్తాడు, న్యూస్‌టుడే: కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు ఎక్కడపడితే అక్కడ నీరు నిలబడ్డాయి. వర్షాలకు సీజనల్ వ్యాధులతోపాటు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నీరు నిల్చినప్రాంతాలను పరిశీలించి డాక్టర్ శివకృష్ణ శుక్రవారం ముందస్తుగా కాలనీల్లో చర్యలు చేపట్టారు. బ్లీచింగ్ పౌడర్, క్రిమిసంహారక మందులు పిచికారీ, మెడికల్ క్యాంప్ ఏర్పాటు, ఇంటింటా ఫీవర్ సర్వే చేపట్టినట్లు వివరించారు.

మన్నీలాలో పశుగణన

రాప్తాడు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటింటి పశుగణన కార్యక్రమం అనంతపురం రూరల్ మన్నీలా గ్రామ పంచాయతీలో డాక్టర్ ఉషా శుక్రవారం నిర్వహించారు. ఇంటింటి పశుగణన పక్కగా నిర్వహిస్తామని తెలిపారు.



సమస్య: మండలంలోని పలు సచివాలయాల్లో ప్రింటర్లు, కంప్యూటర్లు పని చేయడం లేదు. **- రాము**

సమాధానం: మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటాం. **- లక్ష్మీనరసింహ, ఎంపీడీవో** – న్యూస్‌టుడే, ఆత్మకూరు

వ్యర్థాల తొలగింపు



రుద్రంపేట, న్యూస్‌టుడే: రుద్రంపేట పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి 44వ నంబరులో కొన్నేళ్లుగా స్తంభించిన మురుగు తొలగింపు పనులు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు మురుగు కాలువలు వ్యర్థాలతో నిండిపోయి నీరు రహదారులపై చేరడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారింది. దీనిపై 'ఈనాడు'లో వరుస కథనాలు ప్రచురితమవడంతో ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు స్పందించారు. పొక్లెయిన్‌తో మురుగు తొలగింపు పనులు చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి హిదయతుల్లా తెలిపారు.

స్పందనకు వందనం

● రుద్రంపేట పంచాయతీ పరిధి గ్రామ సచివాలయం-2 ముందు గోడకు ఏర్పాటు చేసిన మాజీ సీఎం జగన్, నవరత్నాలు చిత్రాలు అలాగే ఉంచడంతో విమర్శలకు దారితీస్తోంది. ఈ కథనం 'ఈనాడు'లో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి తొలగించారు.

శివారు కాలనీల్లో కారు మబ్బులు



దీపాలు వెలగకపోవడంతో కారు మబ్బు తలపిస్తున్న మాయావతి కాలనీ

నగరం, నగర శివార్లలో పలు కాలనీల్లో రోజుల తరబడి వీధి దీపాలు వెలుగడం లేదు. రాత్రి అవగానే కారుచీకట్లు అలముకుంటున్నాయి. బయటకు రావడానికే ఇబ్బందులు పడుతున్నారు. శివారు ప్రాంతాల్లో రాత్రి పూట విషపురుగులు సంచరిస్తుండటంతో ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటున్నామని స్థానికులు వాపోతున్నారు. రుద్రంపేట పంచాయతీ పరిధి శ్రీనగర్ కాలనీ, చైతన్య కాలనీ, మాయావతి కాలనీలలో గత కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి పూట కారు మబ్బు తలపిస్తున్నాయి. పంచాయతీ అధికారులకు మొరపెట్టుకొంటున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారని స్థానికులు తమ గోడు వెళ్ల బోసుకొంటున్నారు. పంచాయతీ కార్యదర్శి హిదయతుల్లాను వివరణ కోరగా వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

● నగరంలోని రెండో రోడ్డు నాలుగో క్రాస్‌లో విద్యుత్తు దీపం వెలగడం లేదు. కాలనీ మొత్తం చీకటిగా ఉండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

- రుద్రంపేట, కమలానగర్ న్యూస్‌టుడే



రెండోరోడ్డు నాలుగో క్రాస్‌లో

ఐరాసతో ప్రపంచ శాంతి

బుక్కరాయసముద్రం : రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పాటైన ఐక్య రాజ్య సమితి ఏర్పాటుతో ప్రపంచ శాంతి సాధ్యమైందని సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్యులు రామ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఐక్యరాజ్యసమితి దినోత్సవం సందర్భంగా వర్సిటీలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి చరిత్ర, లక్ష్యాలు, ఉద్దేశాన్ని విద్యార్థులకు వివరించారు.



మట్టి కుప్పలు తొలగించరూ!

రుద్రంపేట పంచాయతీ పరిధిలోని డీ మార్ట్ వెనుక భాగంలో నూతనంగా నిర్మించిన సీసీ రహదారులపై మట్టి కుప్పలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. గత కొన్ని రోజులుగా మట్టి కుప్పలు రహదారిపైన వదిలేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మట్టి కుప్పలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, రుద్రంపేట

